





బురదలో నడుస్తున్న పవన్..
బురదలోనే బాలుడితో మాట్లాడుతూ..

మీకు నేనున్నా..

బురదలో తిరుగుతూ.. జనం కష్టాలు వింటూ.. సమస్యలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్

ఏలేరు ఉప్పొంగింది.. గ్రామాలను ముంచెత్తింది.. ఎటు చూసినా నీరే.. అడుగు తీసి అడుగు వేయలేం.. సామాన్యులైనా వెళ్లడం కష్టమే.. అటువంటిది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అడుగేశారు.. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు మడుగులా ఉన్న బురదలో దిగారు.. సమస్యలు విన్నారు.. మీకు నేనున్నానంటూ భరోసాగా నిలిచారు. కాకినాడ జిల్లాలో ఏలేరు వరదేరుగా మారింది. నాలుగేళ్ల తర్వాత ఉగ్రరూపం దాల్చింది. సోమవారం ఒక్కరోజే ఆ జిల్లాలోని ఏడు మండలాల్లో 22 వేల ఎకరాలకు పైగా ముంచేసింది. ఇళ్లనూ చుట్టేసింది. సోమవారం అర్ధరాత్రి గొల్లప్రోలు టోల్‌గేట్‌కు ముందు, వెనుక వరద నీరు హైవేపైకి వచ్చేసింది. ఈ మేరకు సమా చారం అందుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హుటా హుటిన గొల్లప్రోలులో వరద ప్రాంతాలకు చేరుకు న్నారు. బుర దలోనే నడుచుకుంటూ, బోటు ఎక్కి నీటమునిగిన పేదల ఇళ్ల కాలనీకి వెళ్లారు. ఆదుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు. మరో పక్క వర్షాలతో అనేకచోట్ల రహదారులపై పదడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుని-నర్సీపట్నం రోడ్డులో ఆర్టీసీ సర్వీసులు నిలిపివేసింది.

గొల్లప్రోలు, సెప్టెంబరు 9: ఏలేరు రిజర్వాయర్ కన్నెర్ర జేసింది. కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు మండలాల్లో వరద ముంచెత్తింది. పిఠాపురం నియోజకవర్గంలో వరద ప్రభావంతో కొన్ని కాలనీలు నీటమునగగా, వేలాది ఎకరాల్లో పంట వరద పాలైంది. ఈమేరకు సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం హైదరాబాదు నుంచి రాజ మహేంద్రవరం విమానాశ్రయానికి వచ్చి అక్కడ నుంచి నేరుగా గొల్ల ప్రోలు జగనన్న కాలనీకి చేరుకున్నారు. అక్కడ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీని వాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి బోటులో జగనన్న కాలనీ సందర్శనకు బయలుదేరారు. సుద్దగడ్డ వరద ముంపు బారినపడిన గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీలో విస్తృతంగా పర్యటించారు. బోటులో వెళ్లి వరదనీటిలో, బురద మయంగా మారిన రహదారుల్లో నడుస్తూ జగనన్న కాలనీ వా సులను పలకరించి వారి కష్టాలను తీరుస్తానని భరోసా ఇచ్చా రు. కాలనీవాసులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. జగన న్న కాలనీకి వచ్చిన తర్వాత అష్టకష్టాలువడుతున్నామని,కనీసం తాగునీరు అందడం లేదని, రోడ్లు, డ్రెయిన్లు లేవని, తమ పిల్ల లు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పవన్‌కు మొరపెట్టుకున్నారు. ముంపు సమ స్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని, బ్రిడ్జి నిర్మించాలని, తాటిపర్తి రోడ్డుకు అనుసంధానంగా రోడ్డు నిర్మించాలని విన్న వించారు. అందరి కష్టాలు విని మీకు నేను న్నానంటూ భరోసా ఇచ్చారు.

ఆరోగ్యం బాగాలేకున్నా వచ్చా : పవన్

మెట్టలో ఏలేరు, సుద్దగడ్డ వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. వరద ముంపు తగ్గగానే ఆ దిశగా కార్యాచరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆరోగ్యం సహకరించకున్నా వరద పరిస్థితిని సమీక్షిం చేందుకు తాను స్వయంగా వచ్చినట్టు తెలిపారు. జగనన్న కాల నీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపడతామని చెప్పారు. వైఎస్సార్ జగనన్న కాలనీల పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు బలైపోయారన్నారు. వరద ప్రాంతాల సందర్శన అనంత రం పవన్ అత్యవ సర సమీక్ష కోసం మంగళగిరి వెళ్లారు.



నీట మునిగిన ప్రాంతాలకు బోటులో వెళుతున్న పవన్



అధికారులకు పవన్ సూచనలు



గోకవరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బురద కాలువ



ఇసుపల్లి వారి చెరువు వద్ద పడిన గండి

కడగండ్లు.. కన్నీళ్లు

- నిండా ముంచిన బురద కాలువ
- గోకవరం, శ్రీరంగపట్నంలో గండి
- ముంపు బారిన 9 గ్రామాలు
- ఉప్పొంగుతున్న ఎర్రకాల్వ

గోకవరం, సెప్టెంబరు 9 : బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు రైతులను నిండా ముంచాయి. అధికారుల నిర్లక్ష్యం కార ణంగా అనుకోని రీతిలో పంటలు దెబ్బతిన్నాయి. గత కొద్ది రోజులగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న ప్పటికీ సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో ఉన్న కాలువలు,చెరువుల బలహీనగట్లుపై దృష్టిసారించ లేదు. అధిక వర్షాలకు చెరువులు, కాలువలు పొంగి మండలం లోని ఓ కాలువకు సోమవారం గండిపడడంతో పాటు, 8 గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు బురద కాలువకు చేరడంతో సోమవారం ఆ కాలువ ఉధృతంగా ప్రవహించింది. గోకవరం మండలం తంటికొండ రెవెన్యూ పరిధిలో గల ఇసుపల్లివారి చెరువు నుంచి కళింగల ద్వా రా వరద నీరు ప్రవహిస్తూ బురదకాలువలోకి నీరు వెళ్లే కాలువ గట్టుకు గండిపడింది. దీంతో వందలాది ఎకరాల వరి పంట నీట మునిగింది. దీంతో రైతులు తీవ్ర ఆం దోళనలో ఉన్నా రు.దీంతో పాటు ఊర కాలువ తన ఉగ్రరూపాన్ని చూపి ంది.ఈ కాలువకు సమీపంలో ఉన్న సంజీవయ్యనగర్ కాలనీ వాసులను మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్, ఎంపీడీవో పద్మజ్యోతి, ఇతర అధికారులు అప్రమత్తం చేశారు.కాలువ వైపునకు స్థానికులు వెళ్ల కుండా పోలీ సులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అధిక వ ర్షాల కారణంగా మండలంలోని గోకవరం,రంపయ ర్ర ంపాలెం,గంగంపాలెం,తంటికొండ,కృష్ణునిపాలెం, కొత్తపల్లి, తిరుమలాయపాలెం, తదితర గ్రామాల్లో వరి పంట నీట మునిగినట్టు ఏవో రాజేశ్వరి సోమవారం తెలిపారు.

గోకవరంలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారి వర్షాలు పడుతున్నాయి. జిల్లాలో సోమవారం గోకవరం మండలంలో అత్యధికంగా 61 మి.మీ వర్షపాతం నమో దైంది. దేవరపల్లి మండలంలో 42.1 మి.మీ, రాజానగరం 40.8 మి.మీ, రంగంపేట 37.2 మి.మీ, సీతానగరం 36.0 మి.మీ, కోరుకొండ 34.6 మి.మీ, రాజమహేంద్రవరం 32.8 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్ 31.2 మి.మీ, గోపాలపురం 30.8 మి.మీ, తాళ్ళపూడి 30.2 మి.మీ, నల్ల జర్ల 28.6 మి.మీ, నిడదవోలు 28.4 మి.మీ, కడియం 27.2 మి.మీ, ఉండ్రాజవరం 26.8 మి.మీ,చాగల్లు 26.4 మి.మీ, అనపర్తి 26.2 మి.మీ, పెరవలి 24.2 మి.మీ, కొవ్వూరు 22.8 మి.మీ, బిక్కవోలు 18.8 మి.మీ వర్షపాతం నమోదైంది.జిల్లాల్లో 606.2 మి.మీ వర్షం కురిసింది.

మళ్లీ మునిగిన శ్రీరంగపట్నం

కోరుకొండ, సెప్టెంబరు 9 : బురద కాలువ ముం చేసింది.. ఊళ్లూ.. చేలు ఏకం చేసింది. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామాన్ని సోమవారం బుర ద కాలు వ వరదనీరు ముంచేసింది. అధిక వర్షాల కారణంగా జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి పొంగుతున్న వాగులు, వంకలు, నెల్లిపూడి కాలువ, బురద కాలువ, సూరంపా లెం రిజర్వాయర్ మిగులు జలాలు బురద కాలువలోకి రావడంతో ఉధృతి పెరిగింది. దీంతో బుర ద కాలువకు అనే క చోట్ల గండ్లు పడ్డాయి. ఈ నేప థ్యంలో లోతట్టు గ్రామమైన శ్రీరంగపట్నంను ముంచె త్తింది.గ్రామంలోని వంతెన పైనుంచి మూడు అడు గుల ఎత్తున ఉధృతంగా నీరు ప్రవహిస్తుంది. యానా దుల పేట,ఎస్సీపేట, బీసీ కాలనీ, పందులమ్మ గుడి ఏరియా, కేవీఆర్‌ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో పెద్ద ఎత్తునబురదకాలువలో వరదనీరు చేరింది. గ్రామం లోకి 3 అడుగుల మేర వరద నీరు ప్రవేశించింది. సుమారు 500 కుటుంబాల వారు నిరాశ్రయులయ్యా రు. జడ్పీ హై స్కూల్, రైతు భరోసా కేంద్రం, తుఫాన్ షెల్టర్లకు వరద బాధితులను తరలించారు.గ్రామంలోకి వరద నీరు రావడం, గడిచిన రెండు నెలల కాలంలో ఇది మూడోసారి. మూడు సార్లు వరద ముంపును ఎదుర్కొని గ్రామంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతు న్నామని.. బురద కాలువ నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఎమ్మెల్యే బత్తు ల బలరామకృష్ణ శ్రీరంగపట్నం వరద ముంపుకు గురైన ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. జడ్పీ హైస్కూల్ వద్ద పునరావాస కేంద్రంలో తలదాచుకుం టున్న వరద బాధితులను కలిసి ధైర్యం చెప్పారు. బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటామని భరో సా ఇచ్చారు.గ్రామంలో 4 మెడికల్ క్యాంపులు ఏర్పా టు చేశామని ఆహారం,మంచినీరు, పాలు,మందులు అందుబాటులో ఉంచామన్నారు. సూరంపాలెం రిజర్వా యర్ మిగులు జలాలు గ్రామంపై పడకుండా డైవర్షన్ కాలువ ద్వారా తొర్రిగడ్డకు మళ్లిస్తామన్నారు.బురద కా లువ వరద నివారణకు ప్రణాళికలు రూపొందిస్తున్నా మన్నారు.ముంపు ప్రాంతాలను రాజమహేంద్రవరం ఆర్డీవో కె.శివజ్యోతి,తహసీల్దార్ సుస్వాగతం, రెవె న్యూ, ఇరిగేషన్, పీఆర్ సిబ్బంది పరిశీలించారు.



శ్రీరంగపట్నంలో బురద కాలువకు గండి పడిన ప్రాంతం... ఇళ్లలోకి వచ్చిన నీళ్లు



ఉప్పొంగుతున్న ఎర్రకాల్వ

నిడదవోలు, సెప్టెంబరు 9 : ఎర్రకాల్వ ఉప్పొంగు తుం ది. నిడదవోలు మండలం కంసాలిపాలెం, తాడేపల్లి గూడెం మండలం మాధవరం మధ్య ఎర్రకాలువ ప్రవా హం ఉధృ తంగా ఉంది.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జంగారెడ్డిగూడెం కొంగువారి గూడెంలో ఉన్న కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలా శయంలోకి వరద నీరు పోటెత్తుతోంది.దీంతో ఇప్పటికే ప్రాజెక్ట్ నుంచి రెండు గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. దీని కారణంగా నిడదవోలు మండలం కంసాలిపాలెం, రావి మెట్ల, శింగవరం తదితర గ్రామాల్లో ఇప్పటికే అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేప ట్టారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం, తాళ్ళపాలెం, రావిమెట్ల, కంసాలిపాలెం, శింగవరం గ్రామాల్లో ఐదు సహాయక (పునరావాస కేంద్రం) శిబిరాలను ఏర్పాటు చేశామని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, నిడదవోలు మండల ప్రత్యేక అధికారి ఎ.దుర్గేష్ తెలిపారు.పునరావాస కేంద్రాల్లో వైద్య శిబి రాలను అందుబాటులో ఉంచామన్నారు.అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.




రాపాక- నల్గొండ రోడ్డు మూసివేత

సీతానగరం,సెప్టెంబరు 9 : గోదావరి పోటు మీద ఉండడం..భారీ వర్షాలకు వరద నీరు రోడ్డెక్కడంతో ము ందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రాపాక నుంచి నల్గొ ండ,కోటి కేశవరం వెళ్లే రహదారిని సోమవారం తహసీ ల్దార్ఎ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా మూసి వేశారు.దీంతో రాపాక మీదుగా నల్లగొండ, కోటికేశవరం, గోకవరం, కోరుకొండ రాకపోకలు నిలిచిపోయాయి.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 9 : అధిక వర్షపాతం కారణంగా ముం పు గ్రామాలపై దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టరేట్‌లో సోమ వారం అధిక వర్షపాతం నమోదు ముందస్తు చర్యలపై జేసీ ఎస్ చిన్నరాముడు, డీఆర్వో జి.నరసింహులతో కలెక్టర్ సమీక్షించారు. గండ్లు పండేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల గుర్తింపు, అక్కడ ఉన్న పరిస్థితులపై సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. ముంపు బా ధిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మండల స్థాయిలో పునరావాస కేంద్రాలు,మెడికల్ క్యాంపులను సిద్ధం చేసుకోవాలన్నారు. గోకవ రం,కోరు కొండ, సీతానగరం,గోపాలపురం,దేవరపల్లి,నల్లజర్ల,సీతానగరం,పెరవలి,నిడదవోలు త దితర మండలాల తహశీల్దార్లతో క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఆరా తీశారు.



ఆదివారం రాత్రి కెమెరాకు చిక్కిన చిరుత

చిక్కని.. చిరుత

- నాలుగురోజులైనా కానరాని పురోగతి
- నేటికీ అంతుచిక్కని చిరుతపులి జాడ
- ఆదివారం అర్ధరాత్రి కెమెరాలో నిక్షిప్తం
- రంగంలోకి 9 అటవీ బృందాలు
- ఫేక్ మెసేజ్‌లపై ఆందోళన

చిరుత పులి భయపెడుతోంది.. నాలుగు రోజులైనా చిరుత చిక్కకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎటు నుంచి ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. రాజమహేంద్రవరం నగరానికి చేరువగా ఉన్న రిజర్వు ఫారెస్టులో చిరుత పులి నక్కినట్టు అధికారులే చెబుతున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట పెనుశాపంగా పరిణమించింది. జనవాసాల మధ్యనే ఈ ఫారెస్ట్ ఉంది. మరో వైపు హైవేను ఆనుకుని ఉంది. దీంతో నిరంతరం జన సంచారం ఉంటుంది. మరో వైపు పులి నక్కిన ప్రాంతంలోనే రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తున్నా.. హోటళ్లు తెరిచినా ఎటువంటి రక్షణ చర్యలు లేవు. కనీస హెచ్చరిక బోర్డులు లేవు. ఎప్పుడూ చిరుత పులిని పట్టేద్దామనే ఆలోచనే తప్ప.. ప్రజల రక్షణ మరిచారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

చిరుతపులి ధైర్యంగా ఇక్కడే తిరుగుతుంది.పైగా ఫారెస్ట్ అకా డమీ ఆఫీసుల సమీప ప్రాంతాల్లోనే తిరుగుతుంది. శుక్రవారం రాత్రి టీవీ రిలేకేంద్రం ప్రధాన గేటుకు అమర్చిన సీసీ కెమెరాకు చిక్కిన చిరుత ఆదివారం అర్ధరాత్రి 12.29 గంటలకు ఫారెస్ట్ అకాడమీ సమీపంలో అడవిలో అధికారులు అమర్చిన ట్రాప్ కెమెరాకు చిక్కింది.ఇక్కడ ఒకటి గమనించాలి. రాత్రి సమయంలో ఇది రోడ్లపై, మంచి దారుల్లోనే నడుస్తోంది. శుక్రవారం రాత్రి టీవీ రిలే కేంద్రం వద్ద రోడ్డు మీద నడుస్తూ కనిపించింది. ఆదివారం రాత్రి అడవిలో ఓ బాటలో నడుస్తూ ఉంది. ఆదివారం దాని పాదముద్రలు గుర్తించారు. చిరుతను త్వరగా పట్టుకోవ డానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ముందుగా అమర్చిన నాలుగు బోన్లు అలాగే ఉంచుతూ..దాని కదలికలను బట్టి ట్రాప్ కెమేరాలు మారుస్తున్నారు.త్వరగా దీనిని పట్టుకుంటామనే ధీమాతో అధి కారులు ఉన్నారు.సుమారు 50 మంది సిబ్బంది వివిధ విభా గాలు డ్యూటీ చేస్తున్నారు. ట్రాప్ కెమెరాలు కొందరు పర్యవే క్షిస్తుంటే, మరో టీమ్ పాదముద్రలు పరిశీలిస్తుంది. మరొకరు ప్రజలకు అవగాహన కల్పించడం,మరో టీమ్ గస్తీ తిరడం వంటి పనులు చేస్తున్నారు.ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణితో పాటు ఏలూరు అధికారి ఇక్కడ పరిశీలిస్తున్నారు. సీతాఫలాల సీజన్ కా వడంతో ఉదయాన్నే పొలాల్లోకి వెళ్లి రైతులు కాయలు కోస్తుం టారు.చిరుత సంచారం వల్ల పొలాలకు వెళ్లడానికి రైతులు భయ పడుతున్నారు.వెంటనే చిరుతపులిని బంధించాలని కోరుతున్నారు.



అటవీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

భయపడవద్దు : ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ/దివాన్‌చెరువు,సెప్టెంబరు 9 : చిరు త సంచారంపై అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతు లకు గురిచేయవద్దని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీని వాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా అటవీ శాఖ కార్యా లయంలో సోమవారం అధికారులతో సమీక్షించారు. అనంతరం దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీని సందర్శిం చారు. చిరుతను పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు తీసు కుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గత మూడు రోజుల కిందట రిజర్వు ఫారె స్టుకు చిరుత రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నార న్నారు.అటవీ శాఖ అధికారులు 50 మంది సిబ్బందితో 9 బృందా లను ఏర్పాటు చేసి రాత్రి పగలు నిరంతరం గస్తీ కాస్తున్నార న్నారు.అటవీ శాఖ విడుదల చేసిన వీడియోలు చూసి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలన్నారు.బోన్లు ఏర్పాటు చేశారని, చిరు త పట్టుకునే విషయంలో నమ్మకంగా ఉన్నారన్నారు.త్వరలో ప ట్టుకుంటారన్నారు.. ఫేక్ మెసే జ్‌లను చూసి ఎవరు భయపడవ ద్దన్నారు. ఫ్లైన్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఏత్రిమూర్తులరెడ్డి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో హెచ్.హిమ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆరు దాటితే బయటకు రావొద్దు..

దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలోని స్వరూపనగర్, శ్రీరాం పురం, రూపనగర్, రఘునాథపురం గ్రామాల ప్రజలంతా అప్ర మత్తంగా ఉండాలని దివాన్‌చెరువు పంచాయతీ కార్యదర్శి సుంక ర వెంకట రమేష్ సోమవారం విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ ప్రజలు బయట తి రగ వద్దన్నారు. చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్ద ని కోరారు. పొలాల్లో రైతులు నిద్రించవద్దని సూచించారు.



ఫేక్ మేసేజ్‌లు పెడితే ఊరుకోం : బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో చిరుత పులిపై ఫేక్ వీడియో పెట్టిన నామవరం యువకులు

కలకలం రేపిన దూడ కళేబరం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమ హేంద్రవరం శివారు రిజర్వు ఫారెస్టులో చిరుత సంచారం మూడు రోజుల నుంచీ కలకలం రేపుతోంది. నేటికీ చిరుతను పసిగట్టలేకపోవడంతో పరీవాహక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రాత్రి వేళల్లో బయటకు రావడానికే భయపడుతున్నారు.వివిధ పనులపై నగరానికి వచ్చి న వాళ్లు సాయంత్రం ఇళ్లకు త్వరగా చేరుకోవాలని, గుంపు లుగా వెళ్లాలని ఇప్పటికే అధికారులు సూచించారు. రాజాన గరం పోలీస్ స్టేషను పరిధి రఘునాథపురం గ్రామ సమీ పంలో అటవీ ప్రాంతానికి దగ్గరలో పొలాల్లో సోమవారం ఒక దూడ కళేబరాన్ని గుర్తించడం మరింత కలకలం రేపింది.ఆ కళేబరాన్ని అటవీ అధికారులు పరిశీలించారు.చిరుత దాడి చేసి న ఆనవాళ్లు కనిపించడం లేదన్నారు. కుక్కలు, నక్కలు దాడి చేసినట్టు అంచనా వేస్తున్నారు.

రిజర్వు ఫారెస్టులోనే చిరుత పులి
జిల్లా ఇన్‌ఛార్జి అటవీ అధికారి భరణి

దివాన్‌చెరువు,సెప్టెంబరు 9 : రిజర్వు ఫారెస్టులోనే చిరుత ఉందని,ట్రాప్‌బోనులో పడలేదని జిల్లా ఇన్‌ఛార్జి అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రాప్ కెమెరాలు తనిఖీ, పాద ముద్రల గుర్తించుటకు రెండు బృందాలు తిరుగుతున్నాయని అన్నారు. అటవీ ప్రాంతంలోనే చిరుతపులి సంచరిస్తుంద న్నారు. నామవరం సి బ్లాక్ 11వ వీధిలో గత అర్ధరాత్రి నుం చి చిరుతపులి కనిపించినదని కొందరు ఆకతాయిలు ఫేక్ వీడియో తయారుచేశారన్నారు. అసత్య ప్రచారాలు చేసి ప్ర జలను భయభ్రాంతులకు గురి చేయవద్దని కోరారు.

వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిరుత పులి సంచారంపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని ఎస్పీ నర సింహ కిశోర్ పేర్కొన్నారు. వదంతులు వ్యాప్తి చేస్తే కేసులు చర్యలు తప్పవని హెచ్చరించారు. 'చిరుతను బంధించడానికి ఫారెస్టు అధికారులు ఇప్పటికే రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. పోలీసు శాఖ నుంచి కూడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చే శాం. రాత్రి వేళల్లో బీట్లు పెంచాం. గ్రామాల్లో అవగాహన కలి గిస్తున్నాం. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వదంతులను వ్యాప్తి చేస్తే కేసులు తప్పవు. ఏదైనా సమా చారం ఉంటే డయల్ 112కి కాల్ చేయడం బాధ్యతగా భావి ంచాలి.నామవరంలో చిరుత పులి కనిపించిందని కొందరు ఆకతాయిలు వదంతులను వ్యాప్తి చేయ డంపై చర్యలు తీసుకోవడం జరిగింది' అని ఎస్పీ చెప్పారు.

ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయండి సారూ..

దివాన్‌చెరువు, సెప్టెంబరు 9 : చిరుతపులి సంచారం నే పథ్యంలో జాతీయరహదారిపై లాలాచెరువు వద్ద నుంచి పు ష్కరవనం వరకూ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరు తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రయా ణించే వాహనదారులు కొందరు రాత్రివేళల్లో సైతం తమ అ వసరాలను తీర్చుకునేందుకు ఈ ప్రాంతంలో కొద్ది సేపు ఆగి తిరిగి ముందుకుసాగుతారు. అయితే ఈప్రాంతంలోనే చిరుత పులి సంచరిస్తోందన్న వార్తల నేపథ్యంలో అప్రాంతమంతా కాంతులు వెద జల్లేవిధంగా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలి.అ లాగే రాత్రివేళల్లో వాహనాలు నిలుపుదల చేయకుండా వాహ నదారులు, లారీ ఆపరేటర్లకు అవగాహన కల్పించేందుకు అ టవీశాఖ, పోలీసు శాఖలు చర్యలు చేపట్టాలి.ఈ మేరకు ఆ యా ప్రాంతాలకు కొంత దూరంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చే స్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ని త్యం వందలాది మంది జీవనోపాధి పొందుతున్న ఆటోనగర్ ప్రహరీగోడలపై చిరుత సంచరించిందన్న వార్తలు నేపథ్యంలో ఆ ప్రాంతం వారు భయాందోళన చెందుతున్నారు. చిరుత సంచారం నేపథ్యంలో సాయంత్రం ఆరు గంటలకే షాపులు మూసివేసి వెళ్లడమా లేక కొద్దిరోజులు షాపులు పూర్తిగా మూసివేయడమా అన్న ఆలోచనలో పడినట్టు తెలుస్తోంది.



ఆకాశవాణి కేంద్రం నుంచి జీరో జంక్షన్ వరకూ అటవీ ప్రాంతం



విశేష అలంకరణలో విఘ్నేశ్వర స్వామి

సిద్ధి వినాయక స్వామికి పంచ హారతులు

అయినవిల్లి, సెప్టెంబరు 9: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం జరిపారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వర స్వామికి పంచ హారతులు ఇవ్వగా భక్తులు తిలకించి తన్మయులయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సేవలు అందించారు.

వీఆర్‌కు రామచంద్రపురం ఎస్ఐ వాసు!



రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్ఐ పి.వాసును ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వీఆర్‌కు పంపినట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెదపూడి, బిక్కవోలు ఎస్ఐగా పనిచేసిన కాలంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని పలు ఇబ్బందులకు గురిచేసినట్టు వాసుపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను రామచంద్రపురం ఎస్ఐగా నియమించడంపై రామకృష్ణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో పోలీసు ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు ఎస్ఐ వాసును ఎస్పీ వీఆర్‌కు పిలిచినట్టు తెలిసింది.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

రాజానగరం, సెప్టెంబరు 9: నిరుద్యోగులైన యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ఉచిత శిక్షణ ఇస్తామని రాజానగరం సెర్ప్ ఏపీఎం కర్రి హేమనాగలక్ష్మి సోమవారం తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేర్, సర్వీస్‌తో పాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెక్యూరిటీ కెమెరా సర్వీస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బుధవారం ప్రారంభమై నెల పాటు సాగే శిక్షణలో భోజన, వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్, బ్యాంకు లోన్ సహాయం అందిస్తారని చెప్పారు. పదో తరగతి పాస్/ఫెయిల్/ఆపైన విద్యార్హతలతో 18నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాజమహేంద్రవరం ఐఎల్‌టీడీ జంక్షన్ వద్ద శిక్షణా తరగతులు నిర్వహిస్తారని, మరిన్ని వివరాలకు 77805 99939, 96523 04150 నెంబర్లలో సంప్రదించాలని ఏపీఎం కోరారు.



అటవీ శాఖ అధికారులు అమర్చిన ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత పులి

దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే

చిరుత పులి

తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 9: చిరుత పులి దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలోనే ఉన్నట్టు ట్రాప్ కెమెరాలో గుర్తించామని తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి అటవీ అధికారి ఎస్.భరణి తెలిపారు. సోమవారం కూడా ఈ ప్రాంతంలోనే చిరుత పులి పాదముద్రలు గుర్తించినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిరుత పులి వల్ల అటవీ బయట ప్రాంతాల్లో మనుషులకు, పశువులకు ఎటువంటి హాని, ప్రాణ నష్టం జరగలేదన్నారు. ఆదివారం మాదిరిగానే చిరుత పులిని పట్టుకునేందుకు బోనులు ఏర్పాటు చేశామన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారాన్ని బట్టి ట్రాప్ కెమెరాలు అమరికలో మార్పులు చేశామని డీఎఫ్‌వో వివరించారు.



వై.రామవరం-యార్లగడ్డ రహదారి మధ్య వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

కొండవాగులు పొంగిపొర్లాయ్!

వై.రామవరం, సెప్టెంబరు 9: మండలంలోని బండిగడ్డ-సింగవరం మధ్య, యార్లగడ్డ-వై.రామవరం మధ్య, పెద ఊలెంపాడు, దాలిపాడు, గుర్తేడు వరకు ఉన్న కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల గిరిజనులకు రాపోకలు పూర్తిగా స్తంభించాయి. చిన ఊలెంపాడు గ్రామంలోని ఒక వాగు వద్ద రెండు ఆవులు కొట్టుకుపోయినట్టు సమాచారం. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తత చర్యలు చేపట్టారు. ఎంపీడీవో బాపన్నదొర, ఎస్ఐ సంతోష్‌కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది వాగుల వద్ద ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు. వాగులకు అవతల, ఇవతల వైపు ఉన్న ప్రజలు, ఉద్యోగులు సైతం ఎక్కడి వారు అక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సీలేరు నది ఉగ్రరూపం



మోతుగూడెం, సెప్టెంబరు 9: మోతుగూడెంలో ఆదివారం రాత్రి నుంచీ కురుస్తున్న వర్షంతో డొంకరాయి రిజర్వాయర్ గేట్లు ఎత్తేయడంతో సీలేరు నదికి వరద ఉధృతి ఎక్కువైంది. ఆ నీరు మోతుగూడెం రహదారులపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మోతుగూడెం, కొల్లూరు రహదారి జలమయం అవడంతో రాకపోకలు నిలిచిపోయి పొల్లూరు పవర్ హౌస్‌కు వెళ్లే ఉద్యోగస్తులు అవస్థలు పడ్డారు.



లబ్బర్తి-అనంతగిరి మధ్య కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఉధృతంగా వాగులు... స్తంభించిన రాకపోకలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 9: మండలంలో ఆదివారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. నెల్లిమెట్ల కాలనీ-లబ్బర్తి, రాజవొమ్మంగి-శాంతినగర్, మొల్లిమెట్ల-లాగరాయి, వట్టిగెడ్డ-ఎర్రంపాడు గ్రామల మధ్య రోడ్లపై ఉన్న కాజ్‌వేలపై కొండ వాగులు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తహసీల్దారు కరక సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, సీఐ సన్యాసినాయుడు వాగులను పరిశీలించారు. వాగుల వద్ద సిబ్బందిని పహారా పెట్టినట్టు అధికారులు తెలిపారు.



వరద ఉధృతికి కొట్టుకుపోయిన రహదారి

భారీ వర్షాల కారణంగా నెల్లిమెట్ల కాలనీ-లబ్బర్తి మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఉన్న కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహించింది. సోమవారం సాయంత్రం తగ్గుముఖం పట్టిన తర్వాత కాజ్‌వే సమీపంలో కొట్టుకుపోయిన రహదారి బయటపడింది. వరద ఉధృతి తగ్గిన వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు కోరారు.



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

మళ్లీ ఉధృతం

కాటన్ బ్యారేజీ నుంచి 3.72 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 9: ఎగువున కురుస్తున్న వర్షాలకు గోదావరి ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. ఇంద్రావతి, తాలిపేరు నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. కుంట వద్ద శబరి నుంచి వస్తున్న వరద నీరు కలుస్తుండడంతో గోదావరి ఉరకలెత్తుతోంది. సోమవారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద 25.30 అడుగులకు తగ్గిన నీటి మట్టం ఎగువ నుంచి ప్రవాహంతో సాయంత్రం ఆరు గంటలకు 29.60 అడుగులకు చేరు కుంది. ధవళేశ్వరం వద్ద తగ్గుతున్న నీటిమట్టం సోమవారం మధ్యాహ్నానికి ఏడు అడుగులకు చేరుకోగా సాయంత్రం ఆరు గంటలకు నిలకడగా ఉంది. 3,72,932 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.



ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో విజయవాడ-జగదల్‌పూర్ నడుమ ఉన్న ఎర్రబోరు గ్రామం వద్ద 30వ నెంబరు జాతీయ రహదారిని ముంచెత్తిన వరద నీరు

చింతూరును చుట్టుముట్టిన వరద

జలదిగ్బంధంలో మండలంలోని 22 గ్రామాలు

చింతూరు, సెప్టెంబరు 9: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు కుండపోత వర్షం ధాటికి సీలేరు కాంప్లెక్స్‌లోని జల విద్యుత్ కేంద్ర రిజర్వాయర్లు ఒక్కసారిగా నిండిపోయాయి. చింతూరు మండలంలోని డొంకరాయి రిజర్వాయరు నుంచి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ప్రభావం చింతూరు మండలంపై పడింది. ఒక్కసారిగా వచ్చిపడిన వరద గ్రామాలను చుట్టుముట్టింది. వరద నీరు రహదారులపై వడిగా ప్రవహిస్తోంది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం గంటల వ్యవధిలోనే పెరిగి సోమవారం రాత్రికి 41 అడుగులకు చేరింది. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా శబరి పరవళ్లు తొక్కుతోంది. భద్రాచలం వద్ద 30 అడుగులకు చేరువలో గోదావరి ప్రవహిస్తోంది. గర్భిణులను నాటు పడవలపై చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. 22 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆంధ్ర-ఒడిశా నడుమ 326వ జాతీయ రహదారిపై చింతూరు మండలం నిమ్మలగూడెం, కుయుగూరు నడుమ వరద నీరు చేరింది. ఇక ఆంధ్ర-ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నడుమ సుక్మా జిల్లా ఎర్రబోరు వద్ద 30వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు చేరింది. రాకపోకలు నిలిచిపోయాయి.



కల్లేరుకు చెందిన గర్భిణులను నాటు పడవలపై తరలిస్తున్న జాలర్లు

పరిమళించిన మానవత్వం

గోకవరం, సెప్టెంబరు 9: మనుషుల్లో మానవత్వానికి కొదవలేదని చెప్పేందుకు గోకవరంలో చోటుసుకున్న ఈ ఘటనే ఉదాహరణ. తూర్పు గోదావరి జిల్లా గోకవరం ప్రభుత్వాసుపత్రి వద్ద వృద్ధ దివ్యాంగుడు (రెండు కాళ్లు పనిచేయవు) కొద్ది రోజులుగా కడు దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. నిలువ నీడ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎవరైనా దయతలిచి పెడితే కడుపు నింపుకుంటున్నాడు. లేకుంటే పస్తులుంటున్నాడు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూడా ఆసుపత్రి బయటే ఓ పక్క తడుస్తూ మరో పక్క మూలుగుతూ ఒక ప్లాస్టిక్ కవరు కప్పుకుని బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఆ వృద్ధుడి నిస్సహాయ స్థితి స్థానికుల ద్వారా పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావుకు చేరింది. దీంతో ఆయన హుటాహుటిన సిబ్బందిని ఆసుపత్రి వద్దకు పంపించి వృద్ధుడిని సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు చేపట్టారు. ఎటువంటి ఆహార లోటు లేకుండా ఏర్పాట్లు చేశారు. కాగా ఆ ముసలాయన తన సొంతూరు విశాఖపట్టణం అని చెప్తున్నాడు. వృద్ధుడి విషయంలో పంచాయతీ కార్యదర్శి చూపిన ఆదరణను పలువురు అభినందించారు.



వృద్ధుడిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోకి వర్షపు నీరు



మోతుగూడెం, సెప్టెంబరు 9: తుఫాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షానికి సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాలకు వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో అవి ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. జెన్‌కో అధికారులు అప్రమత్తమై డొంకరాయి, గుంటవాడ జలాశయాల నుంచి భారీగా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డొంకరాయి పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా డొంకరాయి జలాశయానికి వలసగెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు వాగుల నుంచి లక్షా పదివేల వరకు ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్నాయి. జలాశయంలో 1,037 అడుగుల వద్ద నీటిమట్టం స్థిరంగా కొనసాగేలా చర్యలు చేపడుతూ ఏడు గేట్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయానికి పిల్లిగెడ్డ వాగు నుంచి 23వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతుండటంతో ఐదు గేట్లు ఎత్తి దిగువకు 23వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,360 అడుగులు కాగా, 1359 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు

కుండపోత వర్షానికి పొల్లూరు జల విద్యుత్ కేంద్రం కొండపైనుంచి వర్షపు నీరు కేబుల్ ట్రెంచ్‌ల ద్వారా టర్బైన్ ఫ్లోర్‌లోకి ప్రవహించింది. జల విద్యుత్ కేంద్రం వెనుక భాగంలో ఉన్న డీవాటరింగ్ పంప్ షెడ్ కూడా నీటిలో మునిగిపోయి సమస్య తలెత్తింది. జెన్‌కో అధికారులు అప్రమత్తమై టర్బైన్ ఫ్లోర్‌లోకి ప్రవేశించిన వర్షపు నీటికి అదనపు మోటార్లను అమర్చి జల విద్యుత్ కేంద్రానికి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోకి నీరు ప్రవేశించడంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయగా ఉదయం 9 గంటల తర్వాత రెండు యూనిట్లను వినియోగంలోకి తీసుకొచ్చారు.

పూర్తిస్థాయికి చేరువలో బలిమెల జలాశయం

సీలేరు కాంప్లెక్సులో అత్యంత పెద్దదైనది బలిమెల జలాశయం, దీని పూర్తిస్థాయి నీటిమట్టం 1516 అడుగులు కాగా ప్రస్తుతం 1510 అడుగులకు చేరింది. మరో ఐదు అడుగుల నీటిమట్టం పెరిగితే బలిమెల జలాశయం నుంచి గుంటవాడ జలాశయానికి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గుంటవాడ జలాశయం నీటిమట్టం తగ్గించేలా జెన్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి

తొమ్మిదేళ్ల జైలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 9: మానసిక వైకల్యం గల మహిళను 2016లో అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి తొమ్మిదేళ్ల జైలుశిక్ష విధిస్తూ సోమవారం న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామానికి చెందిన మానసిక వైకల్యం ఉన్న మహిళ సమీపంలో ఉన్న తోట మణికంఠ ఇంటికి ఏకాదశి పూజల నిమిత్తం వెళ్లింది. అదే గ్రామానికి చెందిన పెయ్యల వీరబాబు తన కూతురిపై అక్కడ అత్యాచారానికి పాల్పడ్డాడని మహిళ తండ్రి అప్పట్లో ఫిర్యాదు చేశాడు. పెయ్యల వీరబాబు, తోట మణికంఠలపై అప్పట్లో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో సీఐ అప్పారావు ఇద్దరిని అరెస్టు చేశారు. సుదీర్ఘమైన వాదనల అనంతరం పెయ్యల వీరబాబుకు తొమ్మిదేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పు ఇచ్చారు.



ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

నాలుగు నెలల పాటు ప్రయాణికుల సేవలో...

సామర్లకోట, సెప్టెంబరు 9: రైలు ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు, పండుగ రోజుల్లో వారికి మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు సోమవారం నుంచి వివిధ ప్రాంతాలకు ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సికింద్రాబాద్-విశాఖ (07097) డిసెంబరు 1 వరకు, విశాఖ-సికింద్రాబాద్ (07098) డిసెంబరు 2 వరకు రాకపోకలు సాగిస్తాయి.

సికింద్రాబాద్‌లో రాత్రి 8.35 గంటలకు బయల్దేరి నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా తెల్లవారుజామున 5.10 గంటలకు రాజమహేంద్రవరం, 5.43 గంటలకు సామర్లకోట, అక్కడి నుంచి అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ మీదుగా విశాఖపట్నం చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో విశాఖలో రాత్రి 7.50 గంటలకు బయల్దేరి దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి మీదుగా రాత్రి 9.36 గంటలకు అన్నవరం, రాత్రి 10.05 గంటలకు సామర్లకోట, 10.45 గంటలకు రాజమహేంద్రవరం అక్కడి నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ మీదుగా సికింద్రాబాద్ ఉదయం 11.15 గంటలకు చేరుతుంది.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ (07440) అక్టోబరు 10 నుంచి డిసెంబరు 1 వరకు, గల శ్రీకాకుళం రోడ్-తిరుపతి (07440), అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2 వరకు రాకపోకలు సాగిస్తాయి.

తిరుపతిలో సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు మీదుగా తెల్లవారుజామున 2.02 గంటలకు రాజమహేంద్రవరం, 2.57 గంటలకు సామర్లకోట, తెల్లవారుజామున నాలుగు గంటలకు తుని, అక్కడి నుంచి అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా అర్ధరాత్రి 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్‌లో సాయంత్రం మూడు గంటలకు బయల్దేరి పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి మీదుగా రాత్రి 8.00 గంటలకు తుని, రాత్రి 8.58 గంటలకు సామర్లకోట, రాత్రి 9.45 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట మీదుగా ఉదయం 8.20 గంటలకు తిరుపతి చేరుతుంది.

నాందేడ్-బెరహమ్‌పూర్ (07431) అక్టోబరు 12 నుంచి నవంబరు 30 వరకు, బెరహమ్‌పూర్-నాందేడ్ (07432) అక్టోబరు 13 నుంచి డిసెంబరు 1 వరకు రాకపోకలు సాగిస్తాయి.

నాందేడ్‌లో సాయంత్రం 3.25 గంటలకు బయల్దేరి ముద్‌ఖేడ్, ధర్మబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు మీదుగా తెల్లవారుజామున 3.48 గంటలకు రాజమహేంద్రవరం, 5.38 గంటలకు సామర్లకోట, అక్కడి నుంచి అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, నౌపాడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం మీదుగా 2.45 గంటలకు బెరహమ్‌పూర్ చేరుతుంది.

తిరుగు ప్రయాణంలో బెరహమ్‌పూర్ నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, నౌపాడ, శ్రీకాకుళం రోడ్, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం మీదుగా రాత్రి 11.30 గంటలకు సామర్లకోట, అర్ధరాత్రి 12.35 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, సికింద్రాబాద్, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మబాద్, ముద్‌ఖేడ్ మీదుగా సాయంత్రం 3.45 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.

ఈ రైళ్లలో ప్రయాణించదలచిన వారు ఆయా స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు.

క్రేన్ రాడ్ జారి పడి యువకుడి మృతి



రామకృష్ణ గణేష్ (పాతచిత్రం)

నిడదవోలు, సెప్టెంబరు 9: క్రేన్ ముందు భాగంలో ఉన్న రాడ్ జారిపడి లారీ యజమాని మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం పందలపర్రు ర్యాంపులో ఇసుక లోడుతో ఉన్న భారీ లారీ బోల్తా పడింది. దానిని రెండు భారీ క్రేన్ల సహాయంతో పైకి లేపుతుండగా క్రేన్ ముందు భాగంలో ఉండే రాడ్‌లారీ బరువుకి ఒక పక్కకి ఒరిగిపోయి లారీ యజమాని అత్తిలి తారక రామకృష్ణ గణేష్ (28)పై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని స్థానికులు నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్య సేవలకు రాజమహేంద్రవరం తరలించగా మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ చెప్పారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి



చిట్టిబాబు (పాతచిత్రం)

తాళ్లరేవు, సెప్టెంబరు 9: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు గోపి చిట్టిబాబు (50) సోమవారం తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఆత్రేయ గోదావరి మేకల కాలువలో చేపలవేటకు వెళ్లిన చిట్టిబాబు వరిసి వల వేస్తూ ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోయాడు. గట్టుమీద ఉన్న దుస్తులు, బకెట్టు చూసిన స్థానికులు కాలువలోకి దిగి వెతకగా చిట్టిబాబు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని కోరింగ పోలీసులు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఏజెన్సీ సమాచారం



ఇందుకూరుపేట వద్ద ఇనుకొండ వాగు ఉధృతి

ఉప్పొంగిన వాగులు

దేవీపట్నం, సెప్టెంబరు 9: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని సీతపల్లి, ఇనుకొండ, వెలగపల్లి వాగులు ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. కొర్రిగెడ్డ వాగు, గంగవరం వాగు పొంగి దొనలంక గ్రామాన్ని చుట్టుముట్టాయి. గ్రామస్తులు అత్యవసరంగా బయటకు వెళ్లడానికి కూడా వీల్లేదని, ఐటీడీఏ పీవో స్పందించి నిత్యావసర సరుకులు పంపిణీ చేసి వారిని ఆదుకోవాలని పాముగండి సర్పంచ్ కొంట్ల శివరెడ్డి కోరారు.



కుంగిన బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న ప్రజలు

వలసగెడ్డ బ్రిడ్జికి ఇరువైపులా గండి

మోతుగూడెం, సెప్టెంబరు 9: వై.రామవరం, డొంకరాయి పరిధిలో గల బచ్చలూరు గ్రామాన్ని ఆనుకుని ఉన్న వలసగెడ్డ వాగు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ప్రవాహ ఉధృతితో బ్రిడ్జికి ఇరువైపులా గండి పడింది. సీలేరు నుంచి దారకొండ మధ్యలో దాదాపు 12చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ కారణంగా భద్రాచలం-విశాఖపట్నం అంతర్ రాష్ట్ర రహదారిలో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఈ విషయమై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కి టీడీపీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఫోనులో సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను పంపించి తగు చర్యలు చేపడతామని ఎంపీటీసీకి హామీ ఇచ్చారు. సీలేరు-దారకొండ ప్రధాన రహదారిలో ఏర్పడిన అడ్డంకులను విశాఖపట్నం వారితో మాట్లాడి తగు చర్యలు చేపడతామని చెప్పారు.

జనజీవనం అస్తవ్యస్తం

కూనవరం, సెప్టెంబరు 9: మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండడంతో మండలంలోని ప్రజలు బయటకు రాలేక ఇబ్బందిపడ్డారు. శబరి, గోదావరి ఉప్పొంగి వారి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. టేకులబోరు-కొండ్రాజుపేట మధ్య రహదారిపై నీరు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు సైతం నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూనవరం, భద్రాచలంలకు ఆటోలు, టాటా మ్యాజిక్‌లపైనే ప్రయాణించాల్సి వచ్చింది. ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించింది.



రంప వాగు వద్ద భద్రతా చర్యలను పరిశీలిస్తున్న పీవో సింహాచలం

కొండవాగుల వద్ద భద్రతా చర్యలు

రంపచోడవరం, సెప్టెంబరు 9: తుపాను ప్రభావంతో ఏజెన్సీలోని కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు వాగులు దాటొద్దని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. భూపతిపాలెం జలాశయం నుంచి నీటిని కిందకు వదలడంతో రంప, పందిరిమామిడి, సీతపల్లి కాలువల ఉధృతిని సోమవారం ఆయన పరిశీలించారు. చేపల వేటకు వెళ్లొద్దని గిరిజనులకు సూచించారు. విద్యుత్ స్తంభాలు విరిగిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని నియమించామన్నారు. పీవో వెంట విద్యుత్ శాఖ ఈఈ ఎండీ యూసఫ్, ఏఈఈ శ్రీనివాసరావు ఉన్నారు.

ఘాటీలో విరిగిపడిన భారీ వృక్షం



మోతుగూడెం, సెప్టెంబరు 9: మోతుగూడెం పరిధిలోని తులసిపాక వ్యూ పాయింట్ మార్గమధ్యంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వృక్షం నేలకూలింది. దీంతో ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి. అర్ధరాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. దీనిపై మోతుగూడెం పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి ఎక్స్‌కవేటరు సహాయంతో చెట్టును తొలగించారు. తులసిపాక-మారేడుమిల్లి ఘాటీలో భారీ వాహనాలను నిలిపివేస్తున్నామని మోతుగూడెం ఎస్‌ఐ జి.గోపాలరావు తెలిపారు.

చెట్టు పడి కూలిన ఇల్లు

మోతుగూడెం, సెప్టెంబరు 9: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తూలుకొండ గ్రామంలో గడసరి ఏసుబాబు ఇంటిపై చెట్టుపడి ఇల్లు కూలిపోయింది. రాత్రి అందరూ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అకస్మాత్తుగా చెట్టుపడిన శబ్దానికి వాళ్లు నిద్రలేచేలోపే చెట్టు ఇంటిపై పడిపోయింది. దీంతో ఏసుబాబు, తల్లి సుక్కమ్మ, భార్య లక్ష్మి, కూతురు మహాలక్ష్మి ఇంటిలోంచి బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. కూలిపని చేసుకునే బతికే మాకు ఇల్లు గడవడమే కష్టంగా ఉందని... ఈ పరిస్థితుల్లో ఉండడానికి గూడు కూడా లేకుండా పోయిందని బోరున విలపించారు. అధికారులు తక్షణం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

సుద్దగొమ్మిలో ఆదివాసీ న్యాయ మహా అభియాన్

రంపచోడవరం, సెప్టెంబరు 9: మండలంలోని సుద్దగొమ్మి గ్రామంలో సోమవారం సర్పంచ్ పండా లక్ష్మి అధ్యక్షతన ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఉప సర్పంచ్ కారం సురేష్‌బాబు మాట్లాడుతూ నిరుపేదలను సమానత్వంగా చూడడమే దీని ముఖ్యోద్దేశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొండరెడ్లు (పీవీటీజీ)కు గృహాలు, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించి పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రత్యేకాధికారి బి.సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు సారపు జోగిదొర, కారం రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

దేవీపట్నం, సెప్టెంబరు 9: మండలంలోని ఇందుకూరుపేట పీహెచ్‌సీలో గర్భిణులకు దేవీపట్నం మండల జనసైనికులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కాకి స్వామి, దాసరి తరుణ్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ తాళ్లూరి డేవిడ్, డాక్టర్ ఎం.సరస్వతి, జనసైనికుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జనసైన మండల వైస్ కన్వీనర్ కర్రి మహేష్, కట్టుమూరి వీరబాబు, కట్టుమూరి తాతాజీ, మట్ట పెదకాపు, దివిటి అంజనేయులు, మట్ట సందీప్, గొల్లపల్లి అరవింద్ పాల్గొన్నారు.

పాఠశాలల క్రీడా పోటీలు వాయిదా

రాజానగరం, సెప్టెంబరు 9: జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 10నుంచి జరగాల్సిన క్రీడా పోటీలు వాయిదా పడినట్టు ఎంఈవో-1 రామన్నదొర సోమవారం తెలిపారు. ఈ నెల 10నుంచి 13వరకు మండల స్థాయిలోను, 17నుంచి 21వరకు నియోజకవర్గ స్థాయిలోను పోటీలు నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ పోటీలను వాయిదా వేసినట్టు చెప్పారు. మండలంలోని వ్యాయామోపాధ్యాయులు అందరు ఈ మార్పును గమనించాలని సూచించారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

- అందుబాటులో క్రేన్లు, గజఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, పడవలు
- చవితి ఉత్సవాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుషితం చేయొద్దు
- అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు/నల్లజర్ల: జిల్లాలోని వినాయక నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. ముందస్తు భద్రత ఏర్పాట్లలో భాగంగా క్రేన్లు, గజఈతగాళ్ళ, లైఫ్ జాకెట్లు, పడవలను అందుబాటులో ఉంచామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఊరేగింపు, నిజమజ్జనాల సమయంలో మద్యం సేవించడం, సాధారణ జన జీవనానికి ఇబ్బంది కలిగించడం, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా ప్రవర్తిం చడం, అశ్లీల నృత్యాలు చేయించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు కూడా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలు, నిజమజ్జనాల నిర్వహణపై ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేశామని, వాటిని కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. భక్తులు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించి మాట్లాడారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఐ విశ్వంకు సూచించారు. అనంతరం నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. చవితి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని కొన్ని మండలాల్లో హిజ్రాలతో అశ్లీల నృత్యాలు వేస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు.ఎవరైనా హిజ్రాలతో కాని మహిళలతో కాని నృత్యాలు నిర్వహించరాదన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ చేసుకోవాలన్నారు. వర్షాలు ఎక్కువగా ఉన్నందున నిమజ్జన కార్యక్రమంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు,స్పెషల్ ఫోర్స్‌తో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామన్నారు.ఆయన వెంట డీఎస్పీ దేవకుమార్, సీఐ ఎన్ శ్రీనివాస్,ఎస్ఐ శ్రీహరిబాబు ఉన్నారు.

జీజీహెచ్‌లో బెడ్స్ 635కు పెంచాలి

- క్రిటికల్ కేర్ భవనాన్ని డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలి
- వైద్య కళాశాల భవన నిర్మాణ సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9: క్రిటికల్ కేర్ భవనాన్ని ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పురోగతి, వైద్య విద్యార్థులకు వసతులు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. వైద్యకళాశాలకు సంబంధించి ఇంకా నిర్మాణ దశలో ఉన్న భవనాలను ఇంజనీర్లు త్వరగా పూర్తి చేసి అప్పగించాలన్నారు. ఎంసీహెచ్ భవనంలోని నాలుగు అంతస్తుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మెడికోలకు సంబంధించి నిర్మాణంలో ఉన్న బాలురు, బాలికల వసతిగృహ భవనాలను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ బెడ్స్ స్థాయిని 350 నుంచి 635కి పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. జీజీహెచ్‌లో రోగులకు అదనపు సౌకర్యాలు కల్పించడానికి, అదనపు షెడ్ల నిర్మాణానికి సమావేశంలో ఆమోదించారు. ఈ సమావేశంలో డీఎం హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వసుంధర, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణ రకాలకు నత్రజని తగ్గించుకోవాలి

వరి పొలాలను సందర్శించిన ఏరువాక శాస్త్రవేత్తలు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 9: స్వర్ణ ఎంటీయూ రకాలకు నత్రజని ఎరువును తగ్గించుకోవాలని ఏరువాక శాస్త్రవేత్తలు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావం రాజమహేంద్రవరం సబ్ డివిజన్ పరిధిలోని కోలమూరు, కడియం గ్రామాల్లో కొద్దిమేర కనిపించిందని 75 ఎకరాల వరిపంట పాక్షికంగా ముంపునకు గురయ్యిందని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహరావు, ప్రధాన శాస్త్రవేత్తలు ఎం.శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. కోలమూరులో వరిపొలాలను వారు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల జల్ల కాలువ ద్వారా నీరు బయటకు వెళ్లకపోవడంతో అక్కడక్కడా వరి పంట మునిగినా వెంటనే నీరు బయటకు పోతుందని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ముంపుప్రాంతాల్లో మాగుడు తెగులు కనిపించిందని దీని నివారణకు హెక్సాకోనాజోల్ 2.0 మిల్లీ లీటర్లు లేదా ప్రోపికోనాజోల్ 1.0 మిల్లీ లీటర్లు, లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షపు నీటి నుంచి తేరుకున్న పొలాల్లో ఎకరాకు 30 కిలోల పొటాష్‌తో పాటు 20 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. ఆకు ముడత నివారణకు కార్బాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లీటరు నీటితో కలిసి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, వ్యవసాయాధికారులు భీమరాజు, ద్వారాకాదేవి, పీటర్ పాల్గొన్నారు.

క్షయతో అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వసుంధరదేవి

- రంగంపేట పీహెచ్‌సీ తనిఖీ.. రికార్డుల పరిశీలన



రంగంపేట పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధరదేవి

రంగంపేట, సెప్టెంబరు 9: మండలంలో అందరూ క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా మందులు వాడాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో, జిల్లా లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ వసుందరదేవి సూచించారు. సోమవారం రంగంపేట పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిగ్రస్తులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వారు క్రమం తప్పకుండా మందులు, మంచి ఆహారం తీసుకునే విధంగా తీసుకునే విధంగా చూడాలని ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలకు సూచించారు. అలాగే పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన వనం-మనం కార్యక్రమంలో భాగంలో డాక్టర్ వసుంధరదేవి, వైద్యులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఒక్కొక్క మొక్క చొప్పున నాటారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా 36 మంది గర్భిణులకు స్కానింగ్ చేసి, రక్త పరీక్షలు నిర్వహించి, అవరమైన మందులు అందించామని వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యులు కె.చిన్నారావు, కె.సంకీర్తన, సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్ఎలు, ఆశాలు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 9: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వ నమోదుపై నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతో సోమవారం రామవరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, నియోజకవర్గంలో ఇంటింటికీ సభ్యత్వ నమోదు చేసేందుకు మండలాలవారీగా ఇన్‌చార్జిలను నియమిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన విలేకరులతో నల్లమిల్లి మాట్లాడుతూ చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అక్రమంగా అరెస్టు చేశారని, చివరకు ఒక్క ఆధారం కూడా చూపలేకపోయారన్నారు. నాడు పవన్‌కళ్యాణ్ చేసిన శపథం ప్రకారం ఒక్క ఓటు కూడా చీలిపోకుండా కూటమిని అధికారం వైపు నడిపించారన్నారు. ఇటీవల వరదల సమయంలో ముఖ్యమంత్రి చూపిన చొరవను, సేవా కార్యక్రమాలను దేశమంతా కీర్తిస్తుందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు ఏపీఆర్ చౌదరి, గుర్రాల వెంకట్రావు, హారిక, రజని, శివరామకృష్ణంరాజు, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, సత్తి దేవదానరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, రామారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి కటౌట్ ఆవిష్కరణ

బిక్కవోలు, సెప్టెంబరు 9: మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి కటౌట్‌ను అర్‌ఎస్.పేట గ్రామానికి చెందిన మాడా మోహన్ సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి బహూకరించారు. దీంతో కటౌట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్.పేట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితులకు మనమంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఆయన నివాసంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ అకాల వర్షాలతో విజయవాడ అతలాకుతలమైందని, వారందరినీ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటోందన్నారు. గతంలో కూడా తుపాన్లు వచ్చినప్పుడు చంద్రబాబు అక్కడే ఉండి పరిస్థితులను చక్కదిద్దారన్నారు. విజయవాడలో భారీ నష్టం జరిగిందని, మనమంతా ఉదారంగా వ్యవహరించి ఆపన్నహస్తం అందించాలని, నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలను పంపిద్దామని, అందుకు అందరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ రూరల్, కడియం మండలాల అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, వెలుగుబంటి రఘురాం, నాయకులు మార్ని వాసుదేవ్, మన్యం నాగేంద్ర, నున్న కృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్, పందూరి అప్పారావు, గంగిన తిరుమలరావు, బోడపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

2,790 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

57 బ్యాగుల్లో రూ.3,34,340 విలువైన బియ్యం స్వాధీనం

కడియం, సెప్టెంబరు 9: రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలో ఉన్న మూడు జిల్లాల్లో పీడీఎస్ (చౌకబియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. కడియం మండలం కడియపులంకలో సోమవారం 57 బ్యాగుల్లో సుమారు 2,790 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు అధికారులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.3,34,340 ఉంటుందన్నారు. డి.కాళీకృష్ణభగవాన్‌ను వాహన డ్రైవరుగా, పెన్నాడ రాంబాబును బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తిగాను గుర్తించామన్నారు. బియ్యంతోపాటు రవాణా చేస్తున్న వాహనం, తూకం యంత్రంను సీజ్ చేసినట్టు చెప్పారు. 6ఏ కేసు నమోదు చేశామన్నారు. సదరు వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదుకు పోలీస్ స్టేషన్‌కు సిఫార్సు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకట రాజు, నవీన్‌కుమార్, కిషోర్ తదితరులున్నారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 18 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం(మీ కోసం) కార్యక్రమంలో 18అర్జీలను అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు స్వీకరించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపించారు. చట్ట పరిధిలో త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు.

భక్తులతో కిటకిటలాడిన లక్ష్మీగణపతి ఆలయం

బిక్కవోలు, సెప్టెంబరు 9: బిక్కవోలులోని లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న చవితి ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామి దర్శనానికి ఉదయం నుంచి వచ్చి బారులు తీరారు. అనంతరం తమ కోర్కెలు చెవిలో చెప్పడానికి పోటీ పడ్డారు. భక్తులకు గ్రామానికి చెందిన పిల్లా గంగరాజు, సూర్యకుమారి దంపతులు అన్నదాన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, గుణ్ణం రమేష్‌చౌదరి, సింగారపు రామారావు, నందిపాటి కిషోర్‌కుమార్, బేరా గోవిందు, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: నాళం భీమరాజు వీధిలో 174 ఏళ్ల శ్రీలక్ష్మీ సిద్ధి వినాయక ఆలయం వద్ద సోమవారం సహస్ర దీపాలంకరణ చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. 23వ వార్డు నందివాడ వారి వీధిలో వజ్రగణపతి ఆలయం వద్ద పీవీ సీతారామ్, పీవీ సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు,ఏఐఐసీ మాజీ చైర్మన్ శ్రిఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన జైలు అధికారులు

కడియం, సెప్టెంబరు 9: కడియపులంక శివాంజనేయ నర్సరీని సోమవారం రాజమహేంద్రవరం జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్ సందర్శించారు. నర్సరీ అధినేత, నర్సరీ సంఘ అధ్యక్షుడు మల్లు పోలరాజు, సెక్రటరీ గాద నాగేశ్వరరావు పూలమొక్కను ఇచ్చి స్వాగతించారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్న మెంటల్, ఇండోర్, ఔట్‌డోర్, ఔషధ మొక్కలు చూసారు. వందల ఏళ్ళ వయస్సు ఉన్న బోన్సాయ్ మొక్కల గురించి పోలరాజు వివరించారు.

బ్యాడ్మింటన్ ఉమెన్ టీం ఛాంపియన్స్ కర్నాటక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9: రాజమహేంద్రవరంలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. సోమవారం జరిగిన పోటీల్లో కర్నాటక జట్టు మంచి ప్రతిభ చూపించి ఉమెన్ టీం ఛాంపియన్‌గా నిలవగా తమిళనాడు జట్టు రన్నరప్‌గా నిలిచింది. అలాగే, బాలుర విభాగంలోనూ కర్నాటక జట్టు టీం ఛాంపియన్ సాధించింది. బాలికల విభాగంలో తమిళనాడు జట్టు టీం ఛాంపియన్‌గా నిలిచారు. తెలంగాణ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు సిటీ ఎమ్మెల్యే సౌత్‌జోన్ ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ పోటీల కమిటీ చైర్మన్ ఆదిరెడ్డి శ్రీనివాస్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.మురళీధరన్ తదితరులు ట్రోఫీలను అందజేశారు.

వేమగిరి, బుర్రిలంకలో వైద్యశిబిరాలు

కడియం, సెప్టెంబరు 9: వేమగిరితోట, బుర్రిలంక గ్రామాల్లో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి డెంగ్యూ మలేరియా పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు ఎం.మణిజ్యోత్స్న, జి.స్వరూప, ఆరోగ్య విస్తరణాధికారి, హెల్త్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యాచారం కేసులో సత్వర న్యాయం జరగాలి

గైనకాలజిస్టుల అసోసియేషన్ డిమాండ్



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9: కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరిగి నెల రోజులు దాటినా.. ఈ కేసులో ఇప్పటి వరకూ బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోవడం విచారకరమని రాజమహేంద్రవరం గైనకాలజిస్టుల అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షురాలు డాక్టర్ అరుణకుమారి, కార్యదర్శి డాక్టర్ దేవిశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం ఐఎంఏ హాలులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టినా ఎలాంటి పురోగతి లేకపోవడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిపై హింసను అరికట్టేందుకు కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ సుజాత, డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ వేణుమాధవి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ దీప్తి, డాక్టర్ లలిత, డాక్టర్ వర్ధిని, డాక్టర్ మంగ, డాక్టర్ దివ్య, డాక్టర్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

45వ డివిజన్‌లో నిత్యావసరాల వితరణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9 : రాజమహేంద్రవరం 45వ డివిజన్‌లో ఇందిరా నగర్, శ్రీలంక లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిత్యావసరాలను పంపిణీ చేశారు. వరద బాధిత ప్రాంతాలైన శ్రీలంక, రాజీవ్ నగర్ లో సోమవారం ఆయన పర్యటించారు. వైసీపీ అధికారంలో ఉండగా శ్రీలంక, రాజీవ్ నగర్ ప్రాంతాలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతాలు నీటమునిగాయన్నారు. ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, అధికారులతో కలిసి 70 కుటుంబాలకు నిత్యావసరాలను అందించారు.

'బ్యారేజీ గేట్ల ప్రమాదంపై విచారణ జరపాలి'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9: కృష్ణా బ్యారేజీ గేట్ల ప్రమాదం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ డిమాండ్ చేశారు. బుడమేరు వరదలకు విజయవాడ అతలాకుతలమై ప్రజలు దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటుంటే ఒడ్డున పడేసేందుకు సీఎం చంద్రబాబు చాలా కష్టపడుతున్నారన్నారు. ఈ క్రమంలో వైసీపీ కుట్ర రాజకీయాలు చేసి బ్యారేజీ గేట్లకు హాని చేశారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి విచారణ జరిపి దోషులు ఎంతటి వారైన కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రఘుదేవపురంలో భారీ చోరీ

పదిన్నర కాసుల బంగారం, రెండు కిలోల వెండి, రూ.70 వేల నగదు అపహరణ

సీతానగరం, సెప్టెంబరు 9: మండలంలోని రఘుదేవపురంలో ఓ ఇంట్లో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. దుండగులు బంగారం, వెండి వస్తువులను అపహరించారు. గ్రామానికి చెందిన యనమదల శిరీష గ్రామంలోని తన పుట్టింటికి కుమారుడు వీరన్నచౌదరితో కలసి వెళ్లింది. సోమవారం ఉదయం వీరన్నచౌదరి ఇంటికి వెళ్లగా తలుపులు తెరచి ఉండడంతో దొంగతనం జరిగిందని గుర్తించి తల్లికి తెలియజేశాడు. బీరువాలో ఉన్న పదిన్నర కాసుల బంగారు గొలుసు, గాజులు, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.70 వేల నగదు పోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ డి.రామ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనపర్తిలో దాబాపై పోలీసు దాడులు

128 నిబ్‌లు, 7 బీర్లు స్వాధీనం.. ఇద్దరిపై కేసు

అనపర్తి, సెప్టెంబరు 9: అనపర్తి కెనాల్ రోడ్డులోని దాబాపై పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. దాబాలో విక్రయించేందుకు ప్రభుత్వ దుకాణంలో కొనుగోలు చేసి ఉంచిన 127 నిబ్‌లు, 7 బీర్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివగణేష్ వివరాల ప్రకారం.. ప్రభుత్వ మద్యం దుకాణం వెనుక ఉన్న దాబా రెస్టారెంట్‌లో మద్యం సీసాలు అక్రమంగా నిల్వ ఉంచారని సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ప్రభుత్వ దుకాణం మూసిన తరువాత వీరు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్నారు. ఈ దాడుల్లో షాపు యజమాని పడాల వెంకటరెడ్డి, సేల్స్‌మెన్ దనేశ్వర్ మాలిక్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఇన్‌చార్జి ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గోకవరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బురద కాలువ


ఇసుపల్లి వారి చెరువు వద్ద పడిన గండి

కడగండ్లు.. కన్నీళ్లు

- నిండా ముంచిన బురద కాలువ
- గోకవరం, శ్రీరంగపట్నంలో గండి
- ముంపు బారిన 9 గ్రామాలు
- ఉప్పొంగుతున్న ఎర్రకాల్వ

గోకవరం, సెప్టెంబరు 9 : బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు రైతులను నిండా ముంచాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనుకోని రీతిలో పంటలు దెబ్బతిన్నాయి. గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో ఉన్న కాలువలు,చెరువుల బలహీనగట్లుపై దృష్టిసారించ లేదు. అధిక వర్షాలకు చెరువులు, కాలువలు పొంగి మండలంలోని ఓ కాలువకు సోమవారం గండిపడడంతో పాటు, 8 గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు బురద కాలువకు చేరడంతో సోమవారం ఆ కాలువ ఉధృతంగా ప్రవహించింది. గోకవరం మండలం తంటికొండ రెవెన్యూ పరిధిలో గల ఇసుపల్లివారి చెరువు నుంచి కళింగల ద్వారా వరద నీరు ప్రవహిస్తూ బురదకాలువలోకి నీరు వెళ్లే కాలువ గట్టుకు గండిపడింది. దీంతో వందలాది ఎకరాల వరి పంట నీట మునిగింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నా రు.దీంతో పాటు ఊర కాలువ తన ఉగ్రరూపాన్ని చూపి ంది.ఈ కాలువకు సమీపంలో ఉన్న సంజీవయ్యనగర్ కాలనీ వాసులను మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్, ఎంపీడీవో పద్మజ్యోతి, ఇతర అధికారులు అప్రమత్తం చేశారు.కాలువ వైపునకు స్థానికులు వెళ్లకుండా పోలీ సులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అధిక వర్షాల కారణంగా మండలంలోని గోకవరం,రంపయ ర్రంపాలెం,గంగంపాలెం,తంటికొండ,కృష్ణునిపాలెం, కొత్తపల్లి, తిరుమలాయపాలెం, తదితర గ్రామాల్లో వరి పంట నీట మునిగినట్టు ఏవో రాజేశ్వరి సోమవారం తెలిపారు.

గోకవరంలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. జిల్లాలో సోమవారం గోకవరం మండలంలో అత్యధికంగా 61 మి.మీ వర్షపాతం నమోదైంది. దేవరపల్లి మండలంలో 42.1 మి.మీ, రాజానగరం 40.8 మి.మీ, రంగంపేట 37.2 మి.మీ, సీతానగరం 36.0 మి.మీ, కోరుకొండ 34.6 మి.మీ, రాజమహేంద్రవరం 32.8 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్ 31.2 మి.మీ, గోపాలపురం 30.8 మి.మీ, తాళ్ళపూడి 30.2 మి.మీ, నల్లజర్ల 28.6 మి.మీ, నిడదవోలు 28.4 మి.మీ, కడియం 27.2 మి.మీ, ఉండ్రాజవరం 26.8 మి.మీ,చాగల్లు 26.4 మి.మీ, అనపర్తి 26.2 మి.మీ, పెరవలి 24.2 మి.మీ, కొవ్వూరు 22.8 మి.మీ, బిక్కవోలు 18.8 మి.మీ వర్షపాతం నమోదైంది.జిల్లాలో 606.2 మి.మీ వర్షం కురిసింది.

మళ్లీ మునిగిన శ్రీరంగపట్నం

కోరుకొండ, సెప్టెంబరు 9 : బురద కాలువ ముంచేసింది.. ఊళ్లూ.. చేలు ఏకం చేసింది. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామాన్ని సోమవారం బురద కాలు వ వరదనీరు ముంచేసింది. అధిక వర్షాల కారణంగా జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి పొంగుతున్న వాగులు, వంకలు, నెల్లిపూడి కాలువ, బురద కాలువ, సూరంపా లెం రిజర్వాయర్ మిగులు జలాలు బురద కాలువలోకి రావడంతో ఉధృతి పెరిగింది. దీంతో బురద కాలువకు అనే క చోట్ల గండ్లు పడ్డాయి. ఈ నేపథ్యంలో లోతట్టు గ్రామమైన శ్రీరంగపట్నంను ముంచెత్తింది.గ్రామంలోని వంతెన పైనుంచి మూడు అడుగుల ఎత్తున ఉధృతంగా నీరు ప్రవహిస్తుంది. యానాదుల పేట,ఎస్సీపేట, బీసీ కాలనీ, పందులమ్మ గుడి ఏరియా, కేవీఆర్ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో పెద్ద ఎత్తునబురదకాలువలో వరదనీరు చేరింది. గ్రామంలోకి 3 అడుగుల మేర వరద నీరు ప్రవేశించింది. సుమారు 500 కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. జడ్పీ హై స్కూల్, రైతు భరోసా కేంద్రం, తుఫాన్ షెల్టర్లకు వరద బాధితులను తరలించారు.గ్రామంలోకి వరద నీరు రావడం, గడిచిన రెండు నెలల కాలంలో ఇది మూడోసారి. మూడు సార్లు వరద ముంపును ఎదుర్కొని గ్రామంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నామని.. బురద కాలువ నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శ్రీరంగపట్నం వరద ముంపుకు గురైన ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. జడ్పీ హైస్కూల్ వద్ద పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులను కలిసి ధైర్యం చెప్పారు. బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.గ్రామంలో 4 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని ఆహారం,మంచినీరు, పాలు,మందులు అందుబాటులో ఉంచామన్నారు. సూరంపాలెం రిజర్వాయర్ మిగులు జలాలు గ్రామంపై పడకుండా డైవర్షన్ కాలువ ద్వారా తొర్రిగడ్డకు మళ్లిస్తామన్నారు.బురద కాలువ వరద నివారణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.ముంపు ప్రాంతాలను రాజమహేంద్రవరం ఆర్డీవో కె.శివజ్యోతి,తహసీల్దార్ సుస్వాగతం, రెవెన్యూ, ఇరిగేషన్, పీఆర్ సిబ్బంది పరిశీలించారు.


శ్రీరంగపట్నంలో బురద కాలువకు గండి పడిన ప్రాంతం... ఇళ్లలోకి వచ్చిన నీళ్లు



ఉప్పొంగుతున్న ఎర్రకాల్వ

నిడదవోలు, సెప్టెంబరు 9 : ఎర్రకాల్వ ఉప్పొంగు తుంది. నిడదవోలు మండలం కంసాలిపాలెం, తాడేపల్లి గూడెం మండలం మాధవరం మధ్య ఎర్రకాలువ ప్రవా హం ఉధృతంగా ఉంది.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జంగారెడ్డిగూడెం కొంగువారి గూడెంలో ఉన్న కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలా శయంలోకి వరద నీరు పోటెత్తుతోంది.దీంతో ఇప్పటికే ప్రాజెక్ట్ నుంచి రెండు గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. దీని కారణంగా నిడదవోలు మండలం కంసాలిపాలెం, రావి మెట్ల, శింగవరం తదితర గ్రామాల్లో ఇప్పటికే అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం, తాళ్ళపాలెం, రావిమెట్ల, కంసాలిపాలెం, శింగవరం గ్రామాల్లో ఐదు సహాయక (పునరావాస కేంద్రం) శిబిరాలను ఏర్పాటు చేశామని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, నిడదవోలు మండల ప్రత్యేక అధికారి ఎ.దుర్గేష్ తెలిపారు.పునరావాస కేంద్రాల్లో వైద్య శిబి రాలను అందుబాటులో ఉంచామన్నారు.అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలువ

రాపాక- నల్గొండ రోడ్డు మూసివేత

సీతానగరం,సెప్టెంబరు 9 : గోదావరి పోటు మీద ఉండడం..భారీ వర్షాలకు వరద నీరు రోడ్డెక్కడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రాపాక నుంచి నల్గొండ,కోటి కేశవరం వెళ్లే రహదారిని సోమవారం తహసీల్దార్ఎ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా మూసివేశారు.దీంతో రాపాక మీదుగా నల్లగొండ, కోటికేశవరం, గోకవరం, కోరుకొండ రాకపోకలు నిలిచిపోయాయి.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 9 : అధిక వర్షపాతం కారణంగా ముంపు గ్రామాలపై దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం అధిక వర్షపాతం నమోదు ముందస్తు చర్యలపై జేసీ ఎస్ చిన్నరాముడు,డీఆర్వో జి.నరసింహులతో కలెక్టర్ సమీక్షించారు. గండ్లు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల గుర్తింపు, నీటి సదుపాయం పై సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. ముంపు బాధిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మండల స్థాయిలో పునరావాస కేంద్రాలు, మెడికల్ క్యాంపులను సిద్ధం చేసుకోవాలన్నారు. గోకవరం,కోరుకొండ, సీతానగరం,గోపాలపురం,దేవరపల్లి,నల్లజర్ల,సీతానగరం,పెరవలి,నిడదవోలు తదితర మండలాల తహశీల్దార్లతో క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఆరా తీశారు.

మీకు నేనున్నా..

బురదలో తిరుగుతూ.. జనం కష్టాలు వింటూ.. సమస్యలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్


బురదలో నడుస్తున్న పవన్.. బురదలోనే బాలుడితో మాట్లాడుతూ..



ఏలేరు ఉప్పొంగింది.. గ్రామాలను ముంచెత్తింది.. ఎటు చూసినా నీరే.. అడుగు తీసి అడుగు వేయలేం.. సామాన్యులైనా వెళ్లడం కష్టమే.. అటువంటిది డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ అడుగేశారు.. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు మడుగులా ఉన్న బురదలో దిగారు.. సమస్యలు విన్నారు.. మీకు నేనున్నానంటూ భరోసాగా నిలిచారు. కాకినాడ జిల్లాలో ఏలేరు వరదేరుగా మారింది. నాలుగేళ్ల తర్వాత ఉగ్రరూపం దాల్చింది. సోమవారం ఒక్కరోజే ఆ జిల్లాలోని ఏడు మండలాల్లో 22 వేల ఎకరాలకు పైగా ముంచేసింది. ఇళ్లనూ చుట్టేసింది. సోమవారం అర్ధరాత్రి గొల్లప్రోలు టోల్గేట్కు ముందు, వెనుక వరద నీరు హైవేపైకి వచ్చేసింది. ఈ మేరకు సమా చారం అందుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హుటా హుటిన గొల్లప్రోలులో వరద ప్రాంతాలకు చేరుకున్నారు. బురదలోనే నడుచుకుంటూ, బోటు ఎక్కి నీటమునిగిన పేదల ఇళ్ల కాలనీకి వెళ్లారు. ఆదుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు. మరో పక్క వర్షాలతో అనేకచోట్ల రహదారులపై పదడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుని-నర్సీపట్నం రోడ్డులో ఆర్టీసీ సర్వీసులు నిలిపివేసింది.

గొల్లప్రోలు, సెప్టెంబరు 9: ఏలేరు రిజర్వాయర్ కన్నెర్ర జేసింది. కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు మండలాల్లో వరద ముంచెత్తింది. పిఠాపురం నియోజకవర్గంలో వరద ప్రభావంతో కొన్ని కాలనీలు నీటమునగగా, వేలాది ఎకరాల్లో పంట వరద పాలైంది. ఈమేరకు సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ సోమవారం హైదరాబాదు నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వచ్చి అక్కడ నుంచి నేరుగా గొల్లప్రోలు జగనన్న కాలనీకి చేరుకున్నారు. అక్కడ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జిల్లా కలెక్టరు సగిలి షాన్మోహన్, ఎస్పీ విక్రాంత్పాటిల్తో కలిసి బోటులో జగనన్న కాలనీ సందర్శనకు బయలుదేరారు. సుద్దగడ్డ వరద ముంపు బారినపడిన గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీలో విస్తృతంగా పర్యటించారు. బోటులో వెళ్లి వరదనీటిలో, బురదమయంగా మారిన రహదారుల్లో నడుస్తూ జగనన్న కాలనీ వాసులను పలకరించి వారి కష్టాలను తీరుస్తానని భరోసా ఇచ్చారు. కాలనీవాసులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. జగనన్న కాలనీకి వచ్చిన తర్వాత అష్టకష్టాలుపడుతున్నామని,కనీసం తాగునీరు అందడం లేదని, రోడ్లు, డ్రెయిన్లు లేవని, తమ పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పవన్కు మొరపెట్టుకున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని, బ్రిడ్జి నిర్మించాలని, తాటిపర్తి రోడ్డుకు అనుసంధానంగా రోడ్డు నిర్మించాలని విన్నవించారు. అందరి కష్టాలు విని మీకు నేను న్నానంటూ భరోసా ఇచ్చారు.

ఆరోగ్యం బాగాలేకున్నా వచ్చా : పవన్

మెట్టలో ఏలేరు, సుద్దగడ్డ వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని పవన్కల్యాణ్ హామీ ఇచ్చారు. వరద ముంపు తగ్గగానే ఆ దిశగా కార్యాచరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆరోగ్యం సహకరించకున్నా వరద పరిస్థితిని సమీక్షించేందుకు తాను స్వయంగా వచ్చినట్టు తెలిపారు. జగనన్న కాలనీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపడతామని చెప్పారు. వైఎస్సార్ జగనన్న కాలనీల పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు బలైపోయారన్నారు. వరద ప్రాంతాల సందర్శన అనంతరం పవన్ అత్యవసర సమీక్ష కోసం మంగళగిరి వెళ్లారు.


నీట మునిగిన ప్రాంతాలకు బోటులో వెళుతున్న పవన్


అధికారులకు పవన్ సూచనలు

చిక్కని.. చిరుత





చిరుత పులి భయపెడుతోంది.. నాలుగు రోజులైనా చిరుత చిక్కకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎటు నుంచి ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. రాజమహేంద్రవరం నగరానికి చేరువగా ఉన్న రిజర్వు ఫారెస్టులో చిరుత పులి నక్కినట్టు అధికారులే చెబుతున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట పెనుశాపంగా పరిణమించింది. జనవాసాల మధ్యనే ఈ ఫారెస్ట్ ఉంది. మరో వైపు హైవేను ఆనుకుని ఉంది. దీంతో నిరంతరం జన సంచారం ఉంటుంది. మరో వైపు పులి నక్కిన ప్రాంతంలోనే రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తున్నా.. హోటళ్లు తెరిచినా ఎటువంటి రక్షణ చర్యలు లేవు. కనీస హెచ్చరిక బోర్డులు లేవు. ఎప్పుడూ చిరుత పులిని పట్టేద్దామనే ఆలోచనే తప్ప.. ప్రజల రక్షణ మరిచారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- నాలుగురోజులైనా కానరాని పురోగతి
- నేటికీ అంతుచిక్కని చిరుతపులి జాడ
- ఆదివారం అర్ధరాత్రి కెమెరాలో నిక్షిప్తం
- రంగంలోకి 9 అటవీ బృందాలు
- ఫేక్ మెసేజ్లపై ఆందోళన

చిరుతపులి ధైర్యంగా ఇక్కడే తిరుగుతుంది.పైగా ఫారెస్ట్ అకాడమీ ఆఫీసుల సమీప ప్రాంతాల్లోనే తిరుగుతుంది. శుక్రవారం రాత్రి టీవీ రిలేకేంద్రం ప్రధాన గేటుకు అమర్చిన సీసీ కెమెరాకు చిక్కిన చిరుత ఆదివారం అర్ధరాత్రి 12.29 గంటలకు ఫారెస్ట్ అకాడమీ సమీపంలో అడవిలో అధికారులు అమర్చిన ట్రాప్ కెమెరాకు చిక్కింది.ఇక్కడ ఒకటి గమనించాలి. రాత్రి సమయంలో ఇది రోడ్లపై, మంచి దారుల్లోనే నడుస్తోంది. శుక్రవారం రాత్రి టీవీ రిలే కేంద్రం వద్ద రోడ్డు మీద నడుస్తూ కనిపించింది. ఆదివారం రాత్రి అడవిలో ఓ బాటలో నడుస్తూ ఉంది. ఆదివారం దాని పాదముద్రలు గుర్తించారు. చిరుతను త్వరగా పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ముందుగా అమర్చిన నాలుగు బోన్లు అలాగే ఉంచుతూ..దాని కదలికలను బట్టి ట్రాప్ కెమేరాలు మారుస్తున్నారు.త్వరగా దీనిని పట్టుకుంటామనే ధీమాతో అధికారులు ఉన్నారు.సుమారు 50 మంది సిబ్బంది వివిధ విభాగాలు డ్యూటీ చేస్తున్నారు. ట్రాప్ కెమెరాలు కొందరు పర్యవేక్షిస్తుంటే, మరో టీమ్ పాదముద్రలు పరిశీలిస్తుంది. మరొకరు ప్రజలకు అవగాహన కల్పించడం,మరో టీమ్ గస్తీ తిరడం వంటి పనులు చేస్తున్నారు.ప్రస్తుతం ఇన్చార్జి డీఎఫ్వో భరణితో పాటు ఏలూరు అధికారి ఇక్కడ పరిశీలిస్తున్నారు. సీతాఫలాల సీజన్ కావడంతో ఉదయాన్నే పొలాల్లోకి వెళ్లి రైతులు కాయలు కోస్తుంటారు.చిరుత సంచారం వల్ల పొలాలకు వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు.వెంటనే చిరుతపులిని బంధించాలని కోరుతున్నారు.


అటవీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

భయపడవద్దు : ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ/దివాన్చెరువు,సెప్టెంబరు 9 : చిరుత సంచారంపై అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షించారు. అనంతరం దివాన్చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీని సందర్శించారు. చిరుతను పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గత మూడు రోజుల కిందట రిజర్వు ఫారెస్టుకు చిరుత రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు.అటవీ శాఖ అధికారులు 50 మంది సిబ్బందితో 9 బృందాలను ఏర్పాటు చేసి రాత్రి పగలు నిరంతరం గస్తీ కాస్తున్నారన్నారు.అటవీ శాఖ విడుదల చేసిన వీడియోలు చూసి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలన్నారు.బోన్లు ఏర్పాటు చేశారని, చిరుత పట్టుకునే విషయంలో నమ్మకంగా ఉన్నారన్నారు.త్వరలో పట్టుకుంటారన్నారు.. ఫేక్ మెసే జ్లను చూసి ఎవరు భయపడవద్దన్నారు. ఫ్లైన్ స్క్వాడ్ డీఎఫ్వో ఏ.త్రిమూర్తులరెడ్డి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్వో హెచ్.హిమ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆరు దాటితే బయటకు రావొద్దు..

దివాన్చెరువు పంచాయతీ పరిధిలోని స్వరూపనగర్, శ్రీరాంపురం, రూపనగర్, రఘునాథపురం గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని దివాన్చెరువు పంచాయతీ కార్యదర్శి సుంకర వెంకట రమేష్ సోమవారం విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ ప్రజలు బయట తిరగ వద్దన్నారు. చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని కోరారు. పొలాల్లో రైతులు నిద్రించవద్దని సూచించారు.

కలకలం రేపిన దూడ కళేబరం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శివారు రిజర్వు ఫారెస్టులో చిరుత సంచారం మూడు రోజుల నుంచీ కలకలం రేపుతోంది. నేటికీ చిరుతను పసిగట్టలేకపోవడంతో పరీవాహక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రాత్రి వేళల్లో బయటకు రావడానికే భయపడుతున్నారు.వివిధ పనులపై నగరానికి వచ్చిన వాళ్లు సాయంత్రం ఇళ్లకు త్వరగా చేరుకోవాలని, గుంపులుగా వెళ్లాలని ఇప్పటికే అధికారులు సూచించారు. రాజానగరం పోలీస్ స్టేషను పరిధి రఘునాథపురం గ్రామ సమీపంలో అటవీ ప్రాంతానికి దగ్గరలో పొలాల్లో సోమవారం ఒక దూడ కళేబరాన్ని గుర్తించడం మరింత కలకలం రేపింది.ఆ కళేబరాన్ని అటవీ అధికారులు పరిశీలించారు.చిరుత దాడి చేసిన ఆనవాళ్లు కనిపించడం లేదన్నారు. కుక్కలు, నక్కలు దాడి చేసినట్టు అంచనా వేస్తున్నారు.

రిజర్వు ఫారెస్టులోనే చిరుత పులి

జిల్లా ఇన్ఛార్జి అటవీ అధికారి భరణి

దివాన్చెరువు,సెప్టెంబరు 9 : రిజర్వు ఫారెస్టులోనే చిరుత ఉందని.ట్రాప్బోనులో పడలేదని జిల్లా ఇన్ఛార్జి అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రాప్ కెమెరాలు తనిఖీ, పాదముద్రల గుర్తించుటకు రెండు బృందాలు తిరుగుతున్నాయని అన్నారు. అటవీ ప్రాంతంలోనే చిరుతపులి సంచరిస్తుందన్నారు. నామవరం సి బ్లాక్ 11వ వీధిలో గత అర్ధరాత్రి నుంచి చిరుతపులి కనిపించినదని కొందరు ఆకతాయిలు ఫేక్ వీడియో తయారుచేశారన్నారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని కోరారు.

వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిరుత పులి సంచారంపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. వదంతులు వ్యాప్తి చేస్తే కేసులు చర్యలు తప్పవని హెచ్చరించారు. 'చిరుతను బంధించడానికి ఫారెస్టు అధికారులు ఇప్పటికే రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. పోలీసు శాఖ నుంచి కూడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. రాత్రి వేళల్లో బీట్లు పెంచాం. గ్రామాల్లో అవగాహన కలిగిస్తున్నాం. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వదంతులను వ్యాప్తి చేస్తే కేసులు తప్పవు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 112కి కాల్ చేయడం బాధ్యతగా భావించాలి.నామవరంలో చిరుత పులి కనిపించిందని కొందరు ఆకతాయిలు వదంతులను వ్యాప్తి చేయ డంపై చర్యలు తీసుకోవడం జరిగింది' అని ఎస్పీ చెప్పారు.

ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయండి సారూ..

దివాన్చెరువు, సెప్టెంబరు 9 : చిరుతపులి సంచారం నేపథ్యంలో జాతీయరహదారిపై లాలాచెరువు వద్ద నుంచి పుష్కరవనం వరకూ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరు తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు కొందరు రాత్రివేళల్లో సైతం తమ అవసరాలను తీర్చుకునేందుకు ఈ ప్రాంతంలో కొద్ది సేపు ఆగి తిరిగి ముందుకుసాగుతారు. అయితే ఈప్రాంతంలోనే చిరుత పులి సంచరిస్తోందన్న వార్తల నేపథ్యంలో ఆప్రాంతమంతా కాంతులు వెద జల్లేవిధంగా ఫ్లడ్లైట్లు ఏర్పాటు చేయాలి.అలాగే రాత్రివేళల్లో వాహనాలు నిలుపుదల చేయకుండా వాహనదారులు, లారీ ఆపరేటర్లకు అవగాహన కల్పించేందుకు అటవీశాఖ, పోలీసు శాఖలు చర్యలు చేపట్టాలి.ఈ మేరకు ఆయా ప్రాంతాలకు కొంత దూరంలో చెక్పోస్టులు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం వందలాది మంది జీవనోపాధి పొందుతున్న ఆటోనగర్ ప్రహరీగోడలపై చిరుత సంచరించిందన్న వార్తలు నేపథ్యంలో ఆ ప్రాంతం వారు భయాందోళన చెందుతున్నారు. చిరుత సంచారం నేపథ్యంలో సాయంత్రం ఆరు గంటలకే షాపులు మూసివేసి వెళ్లడమా లేక కొద్దిరోజులు షాపులు పూర్తిగా మూసివేయడమా అన్న ఆలోచనలో పడినట్టు తెలుస్తోంది.


ఆకాశవాణి కేంద్రం నుంచి జీరో జంక్షన్ వరకూ అటవీ ప్రాంతం

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే ముప్పిడి పర్యటన



20వ డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 9: విజయవాడ-కృష్ణలంక 20వ డివిజన్‌లో ముంపు ప్రాంతమైన రణధీర్‌నగర్‌లో కలెక్టర్ కె.మాధవీలతతో కలిసి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పర్యటించారు. వార్డు సచివాలయం-100లో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం-102 పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి నిర్వాహకులు, ప్రజల నుంచి ఆహార పదార్థాల నాణ్యతను గూర్చి తెలుసుకున్నారు. అలాగే సచివాలయాలు-99,101,103ల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సహాయం అందుతుందో లేదో తెలుసుకున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి



విజయలక్ష్మి(ఫైల్)

కొవ్వూరు, సెప్టెంబరు 9: కొవ్వూరు మండలం పంగిడి హైస్కూల్లో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తొర్లపాటి విజయలక్ష్మి(60) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, పి.సువర్ణరాజు, కొవ్వూరు పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, సలీం, ఉషారాణి, వీరాస్వామి.. విజయలక్ష్మి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాడి పశువులకు వ్యాక్సిన్లు వేయించాలి

పశు సంవర్ధకశాఖ ఏడీ వెంకటరెడ్డి

కొవ్వూరు, సెప్టెంబరు 9: వర్షాకాలంలో పాడి పశువులకు అంటువ్యాధులు ప్రబలకుండా రైతులు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించాలని పశు సంవర్ధకశాఖ కొవ్వూరు ఏడీ ఎ.వెంకటరెడ్డి అన్నారు. వర్షాలు, వరదలు కారణంగా పాడి పశువులకు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. గాలికుంటు, చీడపారు వ్యాధి, గొంతువాపు వ్యాధులు ప్రబలకుండా అన్ని ప్రభుత్వ పశు వైద్యశాలల్లో ఉచితంగా వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. రైతులు అశ్రద్ధ చేయకుండా పశువులకు వేయించాలని సూచించారు.

వరి పొలాల పరిశీలన



శింగవరంలో పొలాల పరిశీలనలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నిడదవోలు, సెప్టెంబరు 9: నిడదవోలు మండలంలో ఎర్రకాలువ వరద నీరు ఆవనీటితో కలిసి పంట చేలలోకి ప్రవేశించనున్న నేపథ్యంలో ముంపు తగ్గిన వెంటనే పలు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వరి చేలను సంరక్షించుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు చెప్పారు. సోమవారం కంసాలిపాలెం, శింగవరం గ్రామాల్లో వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి చేలలో ముంపు తగ్గిన వెంటనే ఎకరానికి పది కిలోల యూరియ, 25 కిలోల పొటాష్ కలిపి వేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏరువాక ప్రధాన శాస్త్రవేత మానుకొండ శ్రీనివాసరావు, ఏవో జి.సత్యనారాయణ, పలువురు రైతులు ఉన్నారు.

వివాదాలకు తావివ్వొద్దు: సీఐ



సదస్సులో మాట్లాడుతున్న సీఐ విజయబాబు

తాళ్లపూడి, సెప్టెంబరు 9: వినాయకచవితి మండప నిర్వాహకులు వివాదాలకు తావివ్వకుండా వేడుకలు నిర్వహించుకోవాలని సీఐ విజయబాబు చెప్పారు. వేగేశ్వరపురంలో వినాయక చవితి మండప నిర్వాహకులకు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో గ్రామానికి విచ్చేసినట్టు చెప్పారు. వేడుకల్లో గానీ, నిమజ్జన కార్యక్రమంలో కానీ ఎటువంటి వివాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.పరశురామారావు, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో దోమతెరల పంపిణీ



దోమతెరలు పంపిణీ చేస్తున్న కొర్లపాటి అన్నవరం

గోపాలపురం, సెప్టెంబరు 9: దోమల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు దాత కొర్లపాటి అన్నవరం అన్నారు. వేళ్లచింతల గూడెం పంచాయతీ పరిధిలోని పెద్దాపురంలో సోమవారం దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నవరం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమతెరలు వినియోగించుకుని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి సిరంజీలు అందజేత



నల్లజర్ల, సెప్టెంబరు 9: నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి జనసేన నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ ఉన్నమట్ల సత్య, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు ఇన్సులిన్ సిరంజీలు అందజేశారు. ఆసుపత్రిలో సిరంజీలు లేక ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించిన వారిద్దరూ తక్షణమే స్పందించి రూ.5 వేలు విలువ చేసే ఇన్సులిన్ సిరంజీలు సోమవారం ఆసుపత్రిలో డాక్టర్ తెల్లం గంగాధర్‌కు అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు సాయితేజ, డాక్టర్ మహ్మద్ సిరాజ్ ఉద్దీన్, వైద్య సంఘ నాయకుడు జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

క్రేన్ రాడ్ జారి పడి యువకుడి మృతి

బోల్తా పడిన ఇసుక లారీని క్రేన్‌తో లేపుతుండగా ఘటన



గణేష్(ఫైల్)

నిడదవోలు, సెప్టెంబరు 9: క్రేన్ ముందుభాగంలో ఉన్న రాడ్ జారిపడి లారీ యజమాని మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. నిడదవోలు మండలం పందలపర్రు ఇసుక ర్యాంపులో ఇసుకలోడుతో ఉన్న భారీ లారీ బోల్తా పడింది. దానిని రెండు భారీ క్రేన్ల సహాయంతో పైకి లేపుతుండగా క్రేన్ ముందు భాగంలో ఉండే రాడ్‌లారీ బరువుకి ఒక పక్కకి ఒరిగిపోయి లారీ యజమాని అత్తిలి తారక రామకృష్ణ గణేష్(28)పై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని స్థానికులు నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్య సేవలకు రాజమహేంద్రవరం తరలించగా మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ తెలిపారు.

పాఠశాలల క్రీడా పోటీలు వాయిదా

రాజానగరం, సెప్టెంబరు 9: జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 10నుంచి జరగాల్సిన క్రీడా పోటీలు వాయిదా పడినట్టు ఎంఈవో-1 రామన్నదొర సోమవారం తెలిపారు. ఈ నెల 10నుంచి 13వరకు మండల స్థాయిలోను, 17నుంచి 21వరకు నియోజకవర్గ స్థాయిలోను పోటీలు నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ పోటీలను వాయిదా వేసినట్టు చెప్పారు. మండలంలోని వ్యాయామోపాధ్యాయులు అందరు ఈ మార్పును గమనించాలని సూచించారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

గుడ్డిగూడెంలో యథేచ్ఛగా ఆక్రమణలు

- ప్రభుత్వ పాఠశాల ప్రహరిని ఆక్రమించి దుకాణాలు
- వాటిలో మద్యం విక్రయాలు..బడిలో తాగుతున్న మందుబాబులు
- జగనన్న కాలనీలో సామాజిక స్థలం ఆక్రమించి భవన నిర్మాణం



జగనన్న కాలనీలో అదనపు భూమిని ఆక్రమించి నిర్మించిన భవనం



ప్రభుత్వ పాఠశాల పరిసరాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

గోపాలపురం, సెప్టెంబరు 9: మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల చుట్టూ అక్రమంగా నిర్మించిన దుకాణాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయి. ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిరివిరామంగా ఆ దుకాణాల్లో అక్రమమద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఆ దుకాణాల్లో విక్రయించిన మద్యాన్ని రాత్రి సమయంలో ప్రభుత్వ పాఠశాలలో మందుబాబులు తాగి, అనంతరం ఆ ప్రదేశంలో ఖాళీ సీసాలను, సిగరెట్లు, వదిలేసి వెళ్లడంతో ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఆ సీసాలను అక్కడి నుంచి తొలగించే పరిస్థితి నెలకొంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రహరీనిక ఆనుకుని అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని పలుమార్లు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు ఆ దుకాణాలను తొలగించే ప్రయత్నం చేయకపోవడతో తమ గోడును పత్రికల ముందు వెల్లబుచ్చుకున్నారు. వీటితో పాటు స్థానిక జగనన్న కాలనీలో ఒక్కొక్క లబ్ధిదారునికి సెంటున్నర మాత్రమే ఇంటి నిర్మాణం కోసం కేటాయించారు. అక్కడ వైసీపీకి చెందిన ఒక వ్యక్తి అతనికి కేటాయించిన స్థలంతో పాటు పక్కనే ఉన్న సామాజిక స్థలాన్ని ఆక్రమించుకుని భవనాన్ని నిర్మించారు. అధికారులు ఆక్రమణదారులపై చర్యలు చేపట్టి ప్రభుత్వ పాఠశాల చుట్టూ అనధికారిక విక్రయాలు జరుపుతున్న దుకాణాలు, సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంలో నిర్మించిన భవనాన్ని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

జీజీహెచ్‌లో బెడ్స్ 635కు పెంచాలి

- క్రిటికల్ కేర్ భవనాన్ని డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలి
- వైద్య కళాశాల భవన నిర్మాణ సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9: క్రిటికల్ కేర్ భవనాన్ని ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పురోగతి, వైద్య విద్యార్థులకు వసతులు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. వైద్యకళాశాలకు సంబంధించి ఇంకా నిర్మాణ దశలో ఉన్న భవనాలను ఇంజనీర్లు త్వరగా పూర్తి చేసి అప్పగించాలన్నారు. ఎంసీహెచ్ భవనంలోని నాలుగు అంతస్తుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మెడికోలకు సంబంధించి నిర్మాణంలో ఉన్న బాలురు, బాలికల వసతిగృహ భవనాలను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ బెడ్స్ స్థాయిని 350 నుంచి 635కి పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. జీజీహెచ్‌లో రోగులకు అదనపు సౌకర్యాలు కల్పించడానికి, అదనపు షెడ్ల నిర్మాణానికి సమావేశంలో ఆమోదించారు. ఈ సమావేశంలో డీఎం హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వసుంధర, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు

- అందుబాటులో క్రేన్లు, గజఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, పడవలు
- చవితి ఉత్సవాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుషితం చేయొద్దు
- అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ నరసింహ కిశోర్



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు/నల్లజర్ల: జిల్లాలోని వినాయక నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. ముందస్తు భద్రత ఏర్పాట్లలో భాగంగా క్రేన్లు, గజఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, పడవలను అందుబాటులో ఉంచామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఊరేగింపు, నిజమజ్జనాల సమయంలో మద్యం సేవించడం, సాధారణ జన జీవనానికి ఇబ్బంది కలిగించడం, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా ప్రవర్తిం చడం, అశ్లీల నృత్యాలు చేయించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు కూడా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలు, నిజమజ్జనాల నిర్వహణపై ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేశామని, వాటిని కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. భక్తులు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించి మాట్లాడారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఐ విశ్వంకు సూచించారు. అనంతరం నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. చవితి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని కొన్ని మండలాల్లో హిజ్రాలతో అశ్లీల నృత్యాలు వేస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు.ఎవరైనా హిజ్రాలతో కాని మహిళలతో కాని నృత్యాలు నిర్వహించరాదన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ చేసుకోవాలన్నారు. వర్షాలు ఎక్కువగా ఉన్నందున నిమజ్జన కార్యక్రమంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు,స్పెషల్ ఫోర్స్‌తో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామన్నారు.ఆయన వెంట డీఎస్పీ దేవకుమార్, సీఐ ఎన్ శ్రీనివాస్,ఎస్ఐ శ్రీహరిబాబు ఉన్నారు.

స్వర్ణ రకాలకు నత్రజని తగ్గించుకోవాలి

వరి పొలాలను సందర్శించిన ఏరువాక శాస్త్రవేత్తలు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 9: స్వర్ణ ఎంటీయూ రకాలకు నత్రజని ఎరువును తగ్గించుకోవాలని ఏరువాక శాస్త్రవేత్తలు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావం రాజమహేంద్రవరం సబ్ డివిజన్ పరిధిలోని కోలమూరు, కడియం గ్రామాల్లో కొద్దిమేర కనిపించిందని 75 ఎకరాల వరిపంట పాక్షికంగా ముంపునకు గురయ్యిందని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహరావు, ప్రధాన శాస్త్రవేత్తలు ఎం.శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. కోలమూరులో వరిపొలాలను వారు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల జల్ల కాలువ ద్వారా నీరు బయటకు వెళ్లకపోవడంతో అక్కడక్కడా వరి పంట మునిగినా వెంటనే నీరు బయటకు పోతుందని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ముంపుప్రాంతాల్లో మాగుడు తెగులు కనిపించిందని దీని నివారణకు హెక్సాకోనజోల్ 2.0 మిల్లీ లీటర్లు లేదా ప్రోపికోనాజోల్ 1.0 మిల్లీ లీటర్లు, లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షపు నీటి నుంచి తేరుకున్న పొలాల్లో ఎకరాకు 30 కిలోల పొటాష్‌తో పాటు 20 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. ఆకు ముడత నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, వ్యవసాయాధికారులు భీమరాజు, ద్వారాకాదేవి, పీటర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితులకు మనమంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఆయన నివాసంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ అకాల వర్షాలతో విజయవాడ అతలాకుతలమైందని, వారందరినీ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటోందన్నారు. గతంలో కూడా తుపాన్లు వచ్చినప్పుడు చంద్రబాబు అక్కడే ఉండి పరిస్థితులను చక్కదిద్దారన్నారు. విజయవాడలో భారీ నష్టం జరిగిందని, మనమంతా ఉదారంగా వ్యవహరించి ఆపన్న హస్తం అందించాలని, నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలను పంపిద్దామని, అందుకు అందరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ రూరల్, కడియం మండలాల అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, వెలుగుబంటి రఘురాం, నాయకులు మార్ని వాసుదేవ్, మన్యం నాగేంద్ర, నున్న కృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్, పందారి అప్పారావు, గంగిన తిరుమలరావు, బోడపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

క్షయతో అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వసుంధరదేవి

- రంగంపేట పీహెచ్‌సీ తనిఖీ.. రికార్డుల పరిశీలన



రంగంపేట పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధరదేవి

రంగంపేట, సెప్టెంబరు 9: మండలంలో అందరూ క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా మందులు వాడాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో, జిల్లా లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ వసుంధరదేవి సూచించారు. సోమవారం రంగంపేట పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిగ్రస్థులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వారు క్రమం తప్పకుండా మందులు, మంచి ఆహారం తీసుకునే విధంగా తీసుకునే విధంగా చూడాలని ఆయా గ్రామాల ఏఎన్ఎంలకు సూచించారు. అలాగే పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన వనం-మనం కార్యక్రమంలో భాగంలో డాక్టర్ వసుంధరదేవి, వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు ఒక్కొక్క మొక్క చొప్పున నాటారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా 36 మంది గర్భిణులకు స్కానింగ్ చేసి, రక్త పరీక్షలు నిర్వహించి, అవరమైన మందులు అందించామని వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యులు కె.చిన్నారావు, కె.సంకీర్తన, సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్ఎలు, ఆశాలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

రేపటి నుంచి తరగతులు ప్రారంభం

రాజానగరం, సెప్టెంబరు 9: నిరుద్యోగులైన యువతీయువకులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్టు రాజానగరంలోని సెర్ప్ ఏపీఎం కర్రి హేమనాగలక్ష్మి సోమవారం తెలిపారు. రాజమహేంద్రవరం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీస్‌తో పాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెక్యూరిటీ కెమెరా సర్వీస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ నెల 11నుంచి ఈ శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. నెల రోజులపాటు సాగే ఈ ఉచిత శిక్షణలో భోజన వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. అలాగే కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్, బ్యాంకు లోన్ సహాయం అందిస్తారని ఏపీఎం చెప్పారు. పదో తరగతి పాస్/ఫెయిల్/ఆపైన విద్యార్హతలతో 18నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాజమహేంద్రవరంలోని ఐఎల్‌టీడీ జంక్షన్ వద్ద ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తారని, మరిన్ని వివరాలకు 77805 99939, 96523 04150 నెంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు.

హత్యాచారం కేసులో సత్వర న్యాయం జరగాలి

గైనకాలజిస్టుల అసోసియేషన్ డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9: కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరిగి నెల రోజులు దాటినా.. ఈ కేసులో ఇప్పటి వరకూ బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోవడం విచారకరమని రాజమహేంద్రవరం గైనకాలజిస్టుల అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షురాలు డాక్టర్ అరుణకుమారి, కార్యదర్శి డాక్టర్ దేవిశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం ఐఎంఏ హాలులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టినా ఎలాంటి పురోగతి లేకపోవడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిపై హింసను అరికట్టేందుకు కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ సుజాత, డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ వేణుమాధవి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ దీప్తి, డాక్టర్ లలిత, డాక్టర్ వర్ధిని, డాక్టర్ మంగ, డాక్టర్ దివ్య డాక్టర్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

రఘుదేవపురంలో భారీ చోరీ

సీతానగరం, సెప్టెంబరు 9: మండలంలోని రఘుదేవపురంలో ఓ ఇంట్లో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. దుండగులు బంగారం, వెండి వస్తువులను అపహరించారు. గ్రామానికి చెందిన యనమదల శిరీష గ్రామంలోని తన పుట్టింటికి కుమారుడు వీరన్నచౌదరితో కలసి వెళ్లింది. సోమవారం ఉదయం వీరన్నచౌదరి ఇంటికి వెళ్లగా తలుపులు తెరచి ఉండడంతో దొంగతనం జరిగిందని గుర్తించి తల్లికి తెలియజేశాడు. బీరువాలో ఉన్న పదిన్నర కాసుల బంగారు గొలుసు, గాజులు, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.70 వేల నగదు పోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ డి.రామ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోదావరి మళ్లీ ఉధృతం

కాటన్ బ్యారేజ్ నుంచి 3.72లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి



కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 9: తగ్గుముఖం పట్టిన గోదావరి ప్రవాహం ఎగువన కురుస్తున్న వర్షాలకు మళ్లీ పెరుగుతోంది. ఇంద్రావతి, తాలిపేరు నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ఎగువన కుంట వద్ద శబరి నది నుంచి వస్తున్న వరద నీరు కలుస్తుండడంతో గోదావరి ఉధృతమై ఉరకలెత్తుతోంది. సోమవారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద 25.30అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం ఎగువ నుంచి వరదనీటి ప్రవాహంతో సాయంత్రం 6గంటలకు 29.60అడుగులకు చేరుకుంది. కాగా ధవళేశ్వరం వద్ద తగ్గుతున్న నీటి మట్టం సోమవారం మధ్యాహ్నానికి 7అడుగులకు చేరుకోగా సాయంత్రం 6గంటలకు అదే రీడింగ్ వద్ద నీటి మట్టం నిలకడగా ఉంది. 3,72,932క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.

బ్యారేజీ గేట్ల ప్రమాదంపై విచారణ జరపాలి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9: కృష్ణా బ్యారేజీ గేట్ల ప్రమాదం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ డిమాండ్ చేశారు. బుడమేరు వరదలకు విజయవాడ అతలాకుతలమై ప్రజలు దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటుంటే ఒడ్డున పడేసేందుకు సీఎం చంద్రబాబు చాలా కష్టపడుతున్నారన్నారు. ఈ క్రమంలో వైసీపీ కుట్ర రాజకీయాలు చేసి బ్యారేజీ గేట్లకు హాని చేశారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి విచారణ జరిపి దోషులు ఎంతటి వారైన కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అనపర్తిలో దాబాపై పోలీసు దాడులు

128 నిబ్‌లు, 7 బీర్లు స్వాధీనం.. ఇద్దరిపై కేసు

అనపర్తి, సెప్టెంబరు 9: అనపర్తి కెనాల్ రోడ్డులోని దాబాపై పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. దాబాలో విక్రయించేందుకు ప్రభుత్వ దుకాణంలో కొనుగోలు చేసి ఉంచిన 127 నిబ్‌లు, 7 బీర్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివగణేష్ వివరాల ప్రకారం.. ప్రభుత్వ మద్యం దుకాణం వెనుక ఉన్న దాబా రెస్టారెంట్‌లో మద్యం సీసాలు అక్రమంగా నిల్వ ఉంచారని సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ప్రభుత్వ దుకాణం మూసిన తరువాత వీరు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్నారు. ఈ దాడుల్లో షాపు యజమాని పడాల వెంకటరెడ్డి, సేల్స్‌మెన్ దనేశ్వర్ మాలిక్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఇన్‌చార్జి ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2,790 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

57 బ్యాగుల్లో రూ.3,34,340 విలువైన బియ్యం



కడియం, సెప్టెంబరు 9: రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలో ఉన్న మూడు జిల్లాల్లో పీడీఎస్ (చౌకబియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. కడియం మండలం కడియపులంకలో సోమవారం 57 బ్యాగుల్లో సుమారు 2,790 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు అధికారులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.3,34,340 ఉంటుందన్నారు. డి.కాశీకృష్ణభగవాన్‌ను వాహన డ్రైవరుగా, పెన్నాడ రాంబాబును బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తిగాను గుర్తించామన్నారు. బియ్యంతోపాటు రవాణా చేస్తున్న వాహనం, తూకం యంత్రంను సీజ్ చేసినట్టు చెప్పారు. 6ఏ కేసు నమోదు చేశామన్నారు. సదరు వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదుకు పోలీస్ స్టేషన్‌కు సిఫార్సు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, నవీన్‌కుమార్, కిషోర్ తదితరులున్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్ 1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	సరిపోదా శనివారం
రాధాకృష్ణ	ఆయ్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్